ఓం నమో భగవతే శ్రీ రమణాయ

రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 సంచిక : 6 ఫిబ్రవరి 2024

ఈ సంచికలో. . . .

స్వభావాన్ని జయించటానికి భగవాన్ చెప్పిన ఉపాయాలు..... 2

భీష్ముడు - విష్ణు సహస్ర నామాలు 3

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు 5

భగవద్గీత 27

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



భగవంతుడు కాల రూపంలో ఉన్నాడు. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంటే, భగవంతుడి అనుగ్రహం మీపై పొంగి, ఈ జన్మలోనే ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు|| 150/-

విడి ప్రతి : రు|| 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

స్వభావాన్ని జయించటానికి భగవాన్ చెప్పిన ఉపాయాలు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

స్వభావాన్ని జయించటానికి భగవాన్ రెండు మార్గాలు చెప్పారు. నీ దేహప్రారబ్ధంలో ఏది వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించు. మనిషి యొక్క ప్రారబ్ధాన్ని బట్టి అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. నీకు ఒక్కోసారి సంతోషం రావచ్చు, ఒక్కోసారి దుఃఖం రావచ్చు. ఇది ప్రారబ్ధం. అంటే, ఏది వచ్చినా, సంతోషం వచ్చినా దుఃఖం వచ్చినా అది ఈశ్వరుని యొక్క ప్రసాదంగా తీసుకో. సంతోషాన్ని మనం ఈశ్వరుని ప్రసాదంగా అనుకుంటాము కాని దుఃఖాన్ని అనుకోము. నీకు వచ్చిన సంతోషాన్ని, నీకు వచ్చిన అదృష్టాన్ని ఎలాగ అయితే ఈశ్వరుని ప్రసాదం అనుకొంటున్నావో అలాగే దురదృష్టం వచ్చినా ఈశ్వరుని ప్రసాదం అనుకుంటే నీకు సమానబుద్ధి కలుగుతుంది. నీకెప్పుడైతే సమానబుద్ధి వచ్చిందో అప్పుడు నువ్వు యోగివి అవుతావు, అప్పుడు నువ్వు తరిస్తావు అని చెప్పారు భగవాన్. అది ఒక పద్ధతి. అంటే, మన జీవితంలో భగవంతుడి యొక్క సంకల్పాన్ని గౌరవించటం. భగవంతుడి యొక్క సంకల్పానుసారంగా మనం నడుచుకోవటం వల్ల మన స్వభావంలో నుంచి మనం బయటికి రావచ్చు.

రెండవపద్ధతి ఏమిటంటే మనం నేను నేను అంటున్నాము, ఈ నేను ఎవడు? అని ప్రశ్నించడం. మనలో నేనుగా ఎవరు వ్యక్తమవుతున్నారంటే, మనస్సు వ్యక్తమవుతోంది. మనస్సు అంటే తలంపుల సమూహం. మనకు ఆదితలంపు, మొదటితలంపు ఈ నేను అనే తలంపే. ఆ నేను దేహముతోటి తాదాత్మ్యము పొంది ఉంటుంది. అసలు మనిషిలో ఉన్న దోషబుద్ధికి కారణం ఈ దేహము నేను అనే తలంపే. నేను అనే తలంపు వచ్చాకే నాది అనే తలంపు వస్తోంది. ఈ నేను అనే తలంపు, నాది అనే తలంపు ఉన్నంతకాలం నిరాకారాన్ని ఆరాధించలేము. కాబట్టి సాకారాన్ని ఆరాధన చెయ్యమని, సద్గుణాలని పెంచుకోమని శాస్త్రం చెపుతోంది. అయితే నీకు ఈశ్వరుడి పట్ల భక్తి కుదరాలి, భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం ఉండాలి, ఈశ్వరుడు సంకల్పాన్ని గౌరవించాలి. ఇంకొకటి, మన స్వభావాన్ని బట్టి మనం మాట్లాడేస్తాము, మన స్వభావాన్ని బట్టి మనం ప్రవర్తిస్తాము, కాని భగవంతుడి వాక్యాన్ని మనం ప్రమాణంగా పెట్టుకోము. మన స్వభావాన్ని ఒకపక్కన పెట్టి, భగవంతుడి వాక్యాన్ని ఎదురుగా పెట్టుకొని జీవిస్తే తరిస్తాము, మన స్వభావం లోనుంచి బయట పడతాము.

భీష్ముడు - విష్ణుసహస్రనామాలు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

భీష్ముడు మహాజ్ఞాని, ఆచార్యుడు, పితామహుడు. భీష్ముడిది స్వచ్ఛంద మరణం, అంటే ఆయనకు ఇష్టమైతేనే మరణిస్తారు కాని ఆయనను ఎవరూ చంపలేరు. భీష్ముడి అంతటి బలమైన మనిషి భారతయుద్ధంలో ద్రోణుడు కాని, కర్ణుడు కాని, అర్జునుడు కాని ఎవరూ లేరు. ఆయన గొప్ప బలమైన వాడే కాదు, గొప్ప భక్తుడు కూడా. భారతయుద్ధంలో ఆయన పది రోజులు యుద్ధం చేసాడు. భీష్ముడు మరణించకపోతే పాండవులు జయం పొందలేరు. అందుచేత కృష్ణుడు పాండవులతో మీరు వెళ్ళి, తాతయ్యా మేము మిమ్మల్ని చంపలేము, మీరు చనిపోకపోతే యుద్ధం ముగియదు, మీరు చనిపోయే విధానం మీరే చెప్పండి అని భీష్ముడిని అడగమని పాండవులను పంపాడు. రేపు ఫలానా రకంగా యుద్ధం చెయ్యండి, నేను పడిపోతాను అని భీష్ముడు చెప్పాడు. ఆ రకంగా పాండవులు యుద్ధం చేసారు. ఆయన పడిపోయాడు. అప్పటికి ఉత్తరాయణం రాలేదు. ఉత్తరాయణం వచ్చేవరకు ఆగి ఆరోజున ఆయన శరీరం విడిచిపెట్టాడు. అదే భీష్మఏకాదశి.

నీరు కావాలంటే మీరు నది దగ్గరకు వెళ్ళండి, చలి వేస్తూ ఉంటే వెళ్ళి నిప్పు దగ్గర కూర్చోండి. కాని జ్ఞానం కావాలంటే నిప్పు ఇవ్వదు, నది ఇవ్వలేదు. మీకు జ్ఞానం కావాలంటే మహాజ్ఞానిని ఆశ్రయించి, ఆయనను సేవించి బ్రహ్మజ్ఞానం పొందండి అని పెద్దలు చెపుతారు. భీష్ముడు శరీరం విడిచిపెట్టేముందు కృష్ణుడు పాండవులను పిలిచి ఆయన మహాత్ముడు, మహర్షి, మహాజ్ఞాని, తండ్రికి ఇచ్చిన మాటను పోషించుకోవటానికి అన్ని సుఖాలు విడిచి పెట్టాడు. మిమ్మల్ని పెంచి పెద్ద చేసాడు, విద్య చెప్పించాడు, ఆయనకు తెలిసినన్ని మంచి విషయాలు తెలిసినవాడు ఇంకొకడు కనబడడు. ఆయన ఇంక ఎంతోకాలం శరీరం ధరించి ఉండరు, ఆయనను ఉపయోగించుకోవాలి అని చెప్పాడు. కృష్ణుడి సలహా మీద భీష్ముడు పాండవులకు అనేక ధర్మాలు బోధించాడు. కృష్ణుడిని దగ్గర పెట్టుకొని పాండవులకు విష్ణుసహస్రనామాలు బోధించాడు. నాలుగు వేదాల సారం విష్ణుసహస్రనామాలు. దాంట్లో వక్త భీష్ముడు, శ్రోత ధర్మరాజు. భగవంతుడి సమక్షంలో భగవంతుడి గుణాలను గానం చేసాడు. అవే విష్ణుసహస్రనామాలు.

దూది ఎంత పెద్ద గుట్టగా ఉన్నా, ఒక్క అగ్గిపుల్లతో మొత్తం అంతా అంటుకుపోతుంది. అలాగే నీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా ఫరవాలేదు, నువ్వు గోవిందనామం చేసుకొంటూ ఉంటే నీ బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ కాలి బూడిద అవుతాయి, వాడే నారాయణుడు, వాడే

కృష్ణుడు అని భీష్ముడు చెపుతాడు. నరకంలో ఎన్ని బాధలు ఉన్నాయో కలియుగంలో కూడా అన్ని బాధలు ఉన్నాయి. ఈ బాధలలో నుండి విడుదల పొందాలంటే గోవిందుడిని స్మరించుకో, నారాయణుడిని స్మరించుకో అంటున్నారు. నారాయణ స్మరణ లేకుండా నీవు మోహంలో నుండి బయటకు రాలేవు. మోహంలో నుండి బయటకు రాకుండా నీవు మోక్షాన్ని ఎలా పొందగలవు. చేతులతో శివుడిని పూజించుకో, నోటినిండా హరిని స్మరించుకో, ఈ కలియుగంలో ఉన్న బాధలు నుండి బయటపడతావు.

భగవంతుడి యొక్క గుణగానమే విష్ణుసహస్రనామాలు. ఆ గుణాలను మనం ఆస్వాదిస్తూ ఉంటే మనం పవిత్రులం అవుతాము, పరిశుద్ధులము అవుతాము. ఏకాగ్రత కలుగుతుంది. అంటే లోపల భగవంతుడికి సంబంధించిన ధ్యాస తప్పించి ఇంకో తలంపు రాదు. అటువంటి ఏకాగ్రత కుదిరినప్పుడే మనకు మోక్షం వస్తుంది. అదే ప్రహ్లాదుడి యొక్క ఏకాగ్రత. భీష్ముడు ఏమి చెపుతున్నాడు అంటే - మీ అమ్మను ప్రేమించు, నాన్నను ప్రేమించు, మీ తాతను ప్రేమించు కాని వీరందరూ బ్రహ్మమే అని ప్రేమించు. నీటిలో అనేక కెరటాలు ఉంటాయి కాని అన్ని కెరటాలలో ఉన్నది నీరే, ఆ నీరుని తీసివేస్తే కెరటం లేదు. మీ అత్తగారు ఒక కెరటం, మీ మావగారు ఒక కెరటం, మీ ఆయన ఒక కెరటం. ఈ కెరటాలు అన్నీ నీటిలో నుండే వచ్చాయి. అలాగే వారందరూ బ్రహ్మంలో నుండే వచ్చారు. అందుచేత ఒకటి మరిచిపోవద్దు. మీ ఇంట్లో వారిని ప్రేమించేటప్పుడు కూడా వారందరూ బ్రహ్మమే అని, బ్రాహ్మీదృష్టితో వారిని ప్రేమించండి. మీ ప్రేమను నామరూపాలకు పరిమితం చేస్తే, మీకు బ్రహ్మభావన కనుక లేకపోతే, మీకు మిగిలేది దుఃఖం, అశాంతి. ఈ ప్రపంచం వేరు, పరమాత్మ వేరు అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము. మనలో ఉన్న కోరికలు, వాసనలు, మనలో స్వార్థం పూర్తిగా విడిచిపెట్టివేస్తే అప్పుడు మీకు లోకం అంతా పరమాత్మగానే కనిపిస్తుంది, బేధబుద్ధి నశిస్తుంది. మీలో ఉన్న వ్యక్తిభావనను పూర్తిగా తొలగిస్తే ఈ సృష్టి అంతా కూడా పరమాత్మగానే గోచరిస్తుంది.

పరమాత్మ శక్తి గురించి మనకు తెలియదు. మన భావనకు ఆయన అందడు. మనకు ఎంత శక్తి ఉందో ఆయనకీ అంతే శక్తి ఉందని అనుకొంటాము. ఈ లోకంలో చాలామంది మాయలు చేసేవారు ఉన్నారు. ఈ మాయలు చేసేవారిని కూడా మాయ చేసేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే పరమాత్మ అని భీష్ముడు చెప్పాడు. మనం ఎంత ప్రయత్నం చేసినా, ఎంత సాధన చేసినా, ఆయన దయ లేకుండా మనం మాయలో నుండి విడుదల పొందలేము. మీ చేతులతో శివుని పూజించండి, మీ నోటి నిండా భగవంతుడిని స్మరించండి, మీరు పొందవలసింది పొందుతారు, మీరు తరిస్తారు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 12 మార్చి 1989, వేంపాడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నాకు మనసులో కుదురు లేదు అని చెప్తారు. దీనికి కారణం ఏమిటంటే, ఈజన్మలో కాని, పూర్వజన్మలో కాని, మనం అందరం చేసినటువంటి పొరపాటు ఒక్కటే. దేవుడు ఏ పని అయితే చేయవద్దు అని చెప్పాడో మనం ఆ పని చేస్తున్నాము. ఇందులో మరీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏ పని చేయవద్దు అని చెప్పాడో ఆ పని మీదకే మన మనస్సు వెళుతుంది. నేను చెప్పే ప్రతీ విషయం కూడా తాత్కాలికంగా మీకు నచ్చకపోయినా ఇంటికి వెళ్లి మీరు ప్రశాంతంగా ఆలోచించుకోండి. ఎందుచేత ఇప్పుడు మీకు కోపంగా ఉంది అనుకోండి, నా మాటలు మీ బుర్రకి ఎక్కవు. మనకి ఎప్పుడైనా చిరాకు వచ్చినా, కోపం వచ్చినా ఆ కోపం రాక ముందు ఉన్న తెలివి, ఆ చిరాకు రాక ముందు ఉన్న తెలివి ఆ గంటలో ఎక్కడికో పారిపోతాయి. అంతా చల్లబడ్డాక మళ్ళీ మన బుర్రలోకి వస్తూ ఉంటుంది. ఈ గంట, రెండు గంటలు మటుకు ఎక్కడికో పారిపోతూ ఉంటుంది. భగవంతుడు ఏ పని అయితే నిషేధించాడో, ఏ పని అయితే చేయవద్దు అన్నాడో, ఆ పనే మనం చేస్తూ ఉంటాము. దాని వలన మనకు అశాంతి వస్తుంది, దుఃఖం వస్తుంది. ఇక్కడ కూర్చున్న మన అందరం కూడా కోపం రాకూడదు, చిరాకు రాకూడదు, ద్వేషం రాకూడదు అని అనుకుంటాము. కాని అందరికి అవే వస్తున్నాయి. శ్రీరాముడికి కోపం వచ్చేది కాదట, ఆయన తెచ్చుకునే వాడు, అదే మనకి ఆయనకి తేడా. ఏ యుద్ధం చేసేటప్పుడో కోపం అవసరం అనుకోండి. ఆ కోపాన్ని తెచ్చుకునేవాడు. తెచ్చుకుంటేనే అది వచ్చేది. మనకి తెచ్చుకోవక్కర్లేదు వద్దు బాబోయ్ అంటే వచ్చేస్తుంది. కోపం స్వాధీనంలో మనం ఉన్నాం, రాముడి స్వాధీనంలో కోపం ఉంది. అందుచేత ఆయన రమ్మంటే వచ్చింది. మనం రమ్మని పిలవక్కరలేదు బలవంతంగా వచ్చి మీద పడుతుంది. రామాయణంలో ఒక చోట రాముడు కోపం తెచ్చుకోలేదు ఆయనకు కోపం వచ్చింది అని ఉంది. మనలాగా వచ్చేసింది ఆయనకి. ఎప్పుడు వచ్చింది రావణాసురుడు తోటి రామచంద్రమూర్తి వారు యుద్ధం చేస్తుంటే, ఆయన కింద నుంచుని యుద్ధం చేస్తున్నాడు, రావణాసురుడు రథం మీద నిలబడి యుద్ధం చేస్తున్నాడు. స్వామీ మీరు కింద నిలబడి యుద్ధం చేయడం మంచిది కాదు నా భుజాల మీద కూర్చొని మీరు యుద్ధం చెయ్యండి అని, ఆంజనేయస్వామి వారు రామచంద్రమూర్తిని ఆయన భుజాల మీద కూర్చోబెట్టుకుని యుద్ధం చేస్తున్నాడు. రావణాసురుడు వేసే బాణం ఒక పక్క వస్తుంటే ఇంకో పక్కకి రామచంద్రమూర్తిని తప్పించేవాడు ఆంజనేయస్వామి. ఎందుచేత ఈయన భుజాల మీద ఉన్నాడు కాబట్టి. అందుచేత రావణాసురుడు ఏమి

చేసేవాడు అంట రాముడి మీదకి గురి పెట్టడం మానేసి, ఈ ఆంజనేయస్వామి మీదకి గురిపెట్టి బాణాలు పెట్టి కొడుతుంటే, ఎర్రగా అయిపోయి శరీరం అంతా రక్తం కారుతుంటే, అప్పుడు కోపం తెచ్చుకోలేదు, కోపం వచ్చింది, ఎవరికి? రామచంద్రమూర్తికి. అంతకుముందు తెచ్చుకునేవాడు అని చెప్పాడు, ఇక్కడ ఒక్కచోటే వచ్చింది అని చెప్పాడు వాల్మీకి. ఆయన స్వవిషయంలో ఆయనకు కోపం వచ్చేది కాదు, తెచ్చుకునేవాడు. కాని తన భక్తుడి విషయానికి వచ్చేటప్పటికి ఆయనకు కోపం వచ్చేసింది, నా యందు ఈశ్వరుడికి ప్రేమ లేదు అని ఎవరు అనుకోవద్దు. మన అందరి పట్ల ప్రేమ ఉంది, ఆప్యాయత ఉంది. అందరిని ప్రేమిస్తున్నాడు. ప్రేమ లేదని మనం అనుకుంటాము. మతం ఎందుకంటే మనసుని బాగు చేయటానికి మతం. మీరు మతాన్ని కాదు మార్చుకోవాల్సింది. మారు మనసు పొందని మనసుని మార్చుకోవాలి. మనసుని మార్చుకుంటే మీకు తప్పనిసరిగా మోక్షం వస్తుంది. యేసు క్రీస్తు తనని ప్రేమించే వాళ్ళని ప్రేమించాడు. అలాగే మనల్ని ప్రేమించే వాళ్ళని మనం ప్రేమిస్తాం. ఇంతవరకు యేసు క్రీస్తు, మనం సమానమే. కాని యేసు క్రీస్తు తనని శిలువ వేసిన వాళ్ళని కూడా ప్రేమించాడు. కాని మనల్ని ఎవరు శిలువ వేయక్కరలేదు చిన్నమాట అంటే వేడిఎక్కిపోతాం. మీరు నేర్చుకుంటే అటువంటి ప్రేమని నేర్చుకోండి. అందుకు చెబుతున్నాను. అలాగే రామచంద్రమూర్తికి ఎన్నో కళ్యాణ గుణాలు ఉన్నాయి. ఎన్నో ఆదర్శ గుణాలు ఉన్నాయి. ఆ గుణాలను నేర్చుకోండి. గౌతమ బుద్ధుడి విషయం తీసుకోండి, తన భార్యని విడిచి పెట్టేశాడు. తన బిడ్డని విడిచి పెట్టేశాడు. భార్య మీద ఇష్టం లేదా? బిడ్డ మీద ఇష్టం లేదా? సమాజాన్ని అంతా ప్రేమిస్తున్న బుద్ధుడు ఆయన భార్యని ప్రేమించడా? తన భార్యని ప్రేమిస్తాడు. అయితే ఎందుకు విడిచి పెట్టాడు సమాజాన్ని అంతా హృదయపూర్వకంగా ప్రేమించడం కోసం, ఆ ప్రేమకి భార్య మీద ఉన్న మమకారం అడ్డు రాకుండా ఉండడం కోసం భార్యని విడిచి పెట్టాడు కాని భార్య మీద ద్వేషం కాదు, కక్ష కాదు. ఇప్పుడు మనకి complaint ఏమిటంటే, మా మనసు కుదురుగా ఉండటం లేదు, మా మనసు చిరాకుగా ఉంటోంది. మాకు అశాంతి వస్తోంది అని ఈజన్మలో కాని, పూర్వజన్మలో కాని, మనం ఏ పని అయితే చేయకూడదో ఆ పని చేశాం. అది అశాంతి రూపంలో మనకి వస్తుంది. మనం భగవంతుడు చెప్పిన పనులు కనుక చేస్తూ ఉంటే, దానివల్ల మనకి శాంతి వస్తుంది, ఆరోగ్యం వస్తుంది, మోక్షం వస్తుంది. భగవంతుడు ఏ పని చేయమన్నాడో ఆ పని చేయండి. ఆయన వద్దు అని చెప్పిన పని మానేయండి. కాని మనం భగవంతుడు వద్దు అని చెప్పిన పని చేస్తాం, అశాంతి వచ్చింది అని బాధ పడతాం. ఆయన చెయ్యమని చెప్పిన పని మనం చేస్తే మనకి సుఖం వస్తుంది. ఆయన వద్దు అని చెప్పిన పని మనం మానేస్తే దుఃఖం రాదు. మేము చెప్పటం తేలిక కాబట్టి చెప్పుకొంటున్నాము. ఆచరించటం కష్టం కాబట్టి మనం దానికి దూరంగా ఉంటున్నాము.

ఎవరైనా చనిపోతే ఏవండి ఎప్పుడు పోయారు? ఎలా పోయారు? అని ఆశ్చర్యంగా అంటాము. కాని ఒక్క మాట మటుకు మీరు అందరూ గుర్తు పెట్టుకోండి. మన తల్లి కడుపులోనుండి మన శరీరం ఎప్పుడు పుట్టిందో ఆ రోజునే చావు కూడా పుట్టింది. మనం పుట్టినప్పుడే మన చావు కూడా పుట్టింది. అయితే పుట్టుకకి, చావుకి కొంత గ్యాప్ ఉంటుంది. చావు ఎప్పుడో వస్తుంది అనుకోకండి పుట్టే ఉంది అది. మనం నిద్ర పోతుంటే అది నిద్రపోతుంది. మనం నడుస్తుంటే అది నడుస్తుంది. మనం కూర్చొంటే అది కూర్చొంటుంది. మన కూడానే ఉంటుంది. కొంతమంది రాత్రి హాయిగా నిద్రపోతారు వెలుగు వచ్చేటప్పటికి మరణిస్తారు. నిద్రలో చావు ఎక్కడ ఉంది నీ కూడానే ఉంది. పుణ్యం చేస్తే సుఖం వస్తుంది. పాపం చేస్తే దుఃఖం వస్తుంది. పుణ్యం చేస్తే సుఖం వస్తుంది కాబట్టి సంతోషం వస్తుంది కాబట్టి పుణ్యం చేయమన్నారు. పాపం చేస్తే దుఃఖం వస్తుంది కాబట్టి పాపం చేయవద్దు అన్నారు. అయితే ఈ పుణ్యం, పాపం రెండు కూడా మనసు యొక్క పరిధిలోనివే. పుణ్యం మనసు యొక్క పరిధి లోనిదే. పాపం మనసు యొక్క పరిధి లోనిదే. మీరు గాఢ నిద్రలో ఉండగా, మీకు పుణ్యం లేదు, పాపం లేదు. ఎందుచేత మీ మనసు అక్కడ లేదు. ఈ పుణ్య పాపాలు కూడా మనసుకి సంబంధించిన విషయాలు. అన్నీ మనసులోనే ఉన్నాయి. నిద్రలో మీకు మనసు లేదు కాబట్టి ఇవి ఏమి లేవు. ఈరోజు వేంపాడులో ఎవరో ప్రశ్న అడిగారు "నాకు ఆత్మ తెలియటం లేదు, ఆత్మ తెలుసుకోవాలని ఉంది" అని. ఆత్మను తెలుసుకోవాలి అని వీడు అనుకుంటున్నాడు. మీరు రెండుగా ఉన్నారా? ఒకటిగా ఉన్నారా? మనం ఆత్మే. కాని ఆత్మను తెలుసుకునేవాడు ఒకడు ఉన్నాడు అనుకుని వాడి తోటి మనం సాధన చేస్తున్నాము, జపం చేస్తున్నాము. కాని ఆత్మను తెలుసుకునేవాడు ఎవడు? ఆత్మను తెలుసుకోవాలి అని అనుకుంటున్నాం మీలో ఒక ఆత్మ ఉందని, తెలుసుకునేవాడు ఒకడు అని ఇద్దరు అయిపోయారు అక్కడ, ఆత్మ ఒక్కటిగా ఉంది కాని రెండుగా లేదు. భగవంతుడు ఏమన్నాడు? మీ హృదయంలో నేను ఆత్మగా ఉన్నాను అని చెప్పి ఊరుకోలేదు. ఆ ఆత్మ ఎవరు? నువ్వే అని చెప్పాడు. మరి ఆ ఆత్మ నువ్వే అని భగవంతుడు చెబితే, మనం ఈ దేహం నేను అనుకుంటున్నాం కారణం ఏమిటి? ఇది మీరు బాగా ఆలోచించాలి. భగవంతుడు ఏమి చెప్పాడు నువ్వు ఆత్మ అంటున్నాడు. అయితే భగవంతుడు అబద్ధం చెబుతాడా? ఆత్మ నీ హృదయంలోనే ఉంది. స్వర్గ రాజ్యం నీ హృదయంలోనే ఉంది. స్వర్గ రాజ్యం ఎక్కడో నీకు దూరాన లేదు. అది నీ హృదయంలోనే ఉంది. Be still and know that I am god. మీ మనసుని ప్రశాంతం చేసుకుంటే, మీ మనసు కనుక నిర్మలం అయితే మీ హృదయంలోని ఆత్మ మీకు అందుతుంది. Be still and know that I am god. దీనికి శ్రీ కృష్ణుడు గీతలో ఏమి చెప్పాడు అహమాత్మా గుడాకేశ, అందరి హృదయాల్లోను నేను ఆత్మగా ఉన్నాను అని చెప్పి, ఆ ఆత్మ ఎవరు నువ్వే

అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు నిజం చెప్పాడా? అబద్ధం చెప్పాడా? మరి భగవంతుడు చెప్పినట్టు మనం ఆత్మే కనుక అయితే నేను దేహాన్ని అనుకుంటున్నానా? ఆత్మను అనుకుంటున్నానా? దేహాన్ని అనుకుంటున్నాను. దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకుంటున్నాను. దేహం పెరుగుతుంటే నేను పెరుగుతున్నాను అనుకుంటున్నాను. దేహం చనిపోతుంటే నేను చనిపోతున్నాను అనుకొంటున్నాను. దేహం నువ్వు అనుకుంటున్నావు. అయితే భగవంతుడు నువ్వు ఆత్మవి అని చెబితే, దేహానివి నువ్వు అని ఎందుకు అనుకుంటున్నావు? మనం అనుకునేది రైటా? భగవంతుడు చెప్పింది రైటా? ఒకవేళ భగవంతుడు చెప్పింది అబద్ధం అనుకుందాం. నువ్వు అనుకొనేదే నిజం అని అనుకుందాం. ఇదే నిజం అయితే దుఃఖం ఎందుకు వస్తోంది? మీలో దుఃఖం లేనివాళ్లు ఎవరైనా ఉన్నారా? పండితుడికి దుఃఖం వస్తుంది, పామరుడికి దుఃఖం వస్తుంది. ధనవంతుడికి దుఃఖం వస్తుంది, ధనం లేనివాడికి దుఃఖం వస్తుంది. అందరికి ఏదో ఒక రూపంలో దుఃఖం వస్తుంది. దేహం నేను అని నువ్వు అనుకునేది నిజం అయితే నిజం లోంచి దుఃఖం రాదు, అబద్ధం లోంచి దుఃఖం వస్తుంది. అసత్యం లోంచి దుఃఖం వస్తుంది. అధర్మం లోంచి దుఃఖం వస్తుంది. సత్యం లోంచి దుఃఖం రాదు. ఆత్మ లోంచి దుఃఖం రాదు. నా దేహం చుట్టూ నేను తిరుగుతున్నాను, ఈ దేహం నేను అనుకుంటున్నాను. ఇదే కనుక యధార్థం అయితే నాకు దుఃఖం రావటానికి వీలు లేదు. నా మనసులో ఉన్న భావాలు అన్నీ నేను అనుకుంటున్నాను. అదే గనుక నిజం అయితే నాకు దుఃఖం రావటానికి వీలు లేదు. నా మనసు నేను అనుకుంటున్నాను, నా దేహం నేను అనుకుంటున్నాను. అయినా నాకు దుఃఖం వస్తోంది. ఎందుచేత? ఏదైతే కాదో, అది నేను అనుకుంటున్నాను కాబట్టి నాకు దుఃఖం వస్తోంది. నా దేహం నేను అనుకుంటున్నాను అది నేను కాదు అందుచేత నాకు దుఃఖం వస్తోంది. నా మనసు నేను అనుకుంటున్నాను. అది నేను కాదు అందుచేత నాకు దుఃఖం వస్తోంది. ఈ దేహమే నువ్వు అనుకో, దేహమే నువ్వు అని భగవంతుడు చెప్పేవాడు. నువ్వు దేహానివి కాదు కాని దేహబుద్ధి నీకు ఎందుకు పోవటం లేదు?

సాధన చేసి ఎవడైతే కామాన్ని ప్రేమగా మార్చుకుంటాడో, కోపాన్ని శాంతిగా మార్చుకుంటాడో వాడు ధన్యజీవి అవుతాడు, ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది.

ఈ దేహబుద్ధి పోవటం కోసమే యోగం. ఈ యోగం ఎందుకు? నీ దేహబుద్ధిని పోగొట్టి నీకు ఆత్మబుద్ధిని కలుగజేయటం కోసమే యోగం, నువ్వు ఏదైతే కాదో అది నువ్వు అనుకుంటున్నావు కాబట్టి దానితోటి ఉన్న సంబంధాన్ని నీకు విడదీసేదే యోగం. దానితోటి ఉన్న సంబంధాన్ని నీకు నరికేదే యోగం, అసత్యం తోటి నీకు ఉన్న సంబంధాన్ని నరికేదే యోగం. ఆ యోగం వల్ల నీకు సుఖం వస్తుంది. యోగం వల్ల నువ్వు సిద్ధిని పొందుతావు. అందుకే కృష్ణుడు అన్ని యోగాలు, భక్తి యోగం, జ్ఞాన యోగం, కర్మ యోగం, ధ్యాన యోగం, ఈ యోగాలు మీకు గీతలో ప్రతిపాదించాడు. యోగం ఒక క్రమ శిక్షణ. ఇంద్రియాలలో క్రమశిక్షణ లేకుండా, మనసులో క్రమశిక్షణ లేకుండా, దేహంలో క్రమశిక్షణ లేకుండా, సత్య వస్తువును మనం తెలుసుకోలేము. మనం అందరం కూడా మన అలవాట్లకి బానిసలం. మన శరీరం మరణిస్తుంది కాని మన అలవాట్లు మటుకు మరణించవు. అలవాట్లు మన కూడానే వస్తాయి. మన అలవాట్లే మనల్ని బంధిస్తున్నాయి అవే సంకెళ్ళు. నేను పది సంవత్సరాలు నుంచి సిగరెట్టు కాలుస్తున్నాను అనుకోండి, సిగరెట్టు మానేస్తే మంచిది ఆరోగ్యం అని ఎవరైనా చెబుతారు అనుకోండి, ఆరోగ్యం అని చెప్పినప్పటికీ నేను ఆ సిగరెట్టు మానుకోలేను. అయితే దేహబుద్ధి అనే అలవాటు నాకు ఎంతోకాలం నుంచి ఉంది అది నేను ఎలా మానగలను? దేహానివి నువ్వు అనుకోవడం నిజం కాదు. ఒక అలవాటును బట్టి నువ్వు అనుకుంటున్నావు. ఎప్పటి నుంచి అనుకుంటున్నావు? ఎంతో కాలం నుంచి అనుకుంటున్నావు. ఎన్నో జన్మల నుంచి అనుకుంటున్నావు. ఇవాళ ఒక్కసారి నువ్వు దేహానివి కాదు అంటే నువ్వు కంగారు పడుతున్నావు. భగవంతుడు చెప్పేది నువ్వు అబద్ధం అనుకుంటున్నావు. అంగుళం అంగుళానికి దేహబుద్దే. నేను ఎక్కడ నుంచి వచ్చాను? జిన్నూరు నుంచి వచ్చాను. జిన్నూరు నుంచి ఎవరు వచ్చారు? నా దేహం వచ్చింది. నేను వచ్చానా అసలు. ప్రతీది కూడా దేహబుద్ధి మీద ఆధారపడి మనం ఆలోచిస్తూ ఉంటాము. ఏది చదివినా దేహబుద్ధి తోటే చదువుతాం. దేహబుద్ధి తోటే ప్రతీ పని చేస్తాం. అందుచేత ఏ మనిషిని దుఃఖం విడిచిపెట్టదు. మీకు ఎంతకాలం అయితే దేహబుద్ధి ఉందో అంతకాలం శవాలని మోయాల్సిందే. ఇది రమణస్వామి చెప్పినటువంటి సూత్రం. నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం నీకు మరణం వస్తుంది. జన్మ వస్తుంది. అందుచేత తప్పనిసరిగా నిన్ను దుఃఖం కూడా విడిచిపెట్టదు. ఎందుచేత నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. అబద్ధం నిజం అనుకుంటున్నావు కాబట్టి నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. అశాంతి విడిచిపెట్టదు. ఆందోళన విడిచిపెట్టదు. సోదరమహాశయులారా! ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మతం పేరు మీద చెప్పే విషయాలు కూడా నూటికి యాభై శాతం అబద్ధాలు. అందరిలోనూ ఆత్మ ఉన్న మాట నిజం. దీన్ని ఆధారంగా చేసుకుని ఎన్నో కల్పించేస్తున్నారు మతాల పేరు మీద, అది హిందూమతం అవ్వనివ్వండి, క్రైస్తవమతం అవ్వనివ్వండి, బౌద్ధమతం అవ్వనివ్వండి, ఇస్లాంమతం అవ్వనివ్వండి. అనవసరంగా ఈ మతం పేరు మీద ఉద్రేకాలు తెచ్చుకుని,

ఆందోళన తెచ్చుకుని , ఆవేశాలు తెచ్చుకుని, మానసికమైన ఆరోగ్యం, శారీరకమైన ఆరోగ్యం పోగొట్టుకోవటమే కాని ఈ మతం పేరు మీద నూటికి యాభై అబద్ధాలు. అందుచేత అనవసర విషయాలకు వెళ్ళకండి. మీకు హృదయంలో ఆత్మ ఉన్న మాట నిజం. ఒక సత్య వస్తువు ఉన్న మాట నిజం. ఏ పరమేశ్వరుడు అయితే ఈ సృష్టిని అంతా నడుపుతున్నాడో, దాని అంశ, దాని శక్తి, మీ హృదయంలో కూడా ఉంది. మీ హృదయంలో ఉన్న శక్తి మీకు అర్థం కాకపోతే ప్రపంచాన్ని నడిపే శక్తి కూడా మీకు అర్థం కాదు. భగవంతుడు ఏమి చెబుతున్నాడు? నువ్వు ఆత్మవి అని చెబుతున్నాడు. పైగా ఆత్మకి మరణం లేదు అంటున్నాడు. ఆత్మ పుట్టలేదు. నేను పుట్టాను అనుకుంటున్నాడు ప్రతీ మనిషి, మరి పుట్టింది ఎవరు? నువ్వు చెప్పే నేను ఎవరు? ఈ దేహమే కనుక నిజం అయితే ఇరవై నాలుగు గంటలు నీకు దేహస్మృతి ఎందుకు లేదు. నీ మనస్సే కనుక నిజం అయితే ఇరవై నాలుగు గంటలు నీ మనసు ఎందుకు లేదు? నీ మనసు కనుక నిజం అయితే నిద్రలో కూడా నీకు మనస్సు ఉండాలి కదా! మీరు అందరూ ఆలోచించండి. ఆలోచన కూడా ఒక తపస్సే. మీరు వినటం ఒక్కటే కాదు. మీరు అందరూ ఆలోచించండి. ఆలోచించడం కూడా చాలా అవసరం. ఆలోచిస్తే అర్థం అవుతుంది. అర్థం అయితే మీకు జీర్ణం అవుతుంది. జీర్ణం అయితే మీ శరీరానికి, మీ మనసుకి, బలం చేకూరుతుంది. అందుచేత సబ్జెక్టు మీరు బాగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. ఈ నేను అనే తలంపు వచ్చాకే నువ్వు దేవుడి గురించి ఆలోచిస్తున్నావు. లేకపోతే వ్యవసాయదారుడు వ్యవసాయం గురించి ఆలోచిస్తున్నాడు. వర్తకుడు వర్తకం గురించి ఆలోచిస్తున్నాడు. ఏది ఆలోచించినప్పటికి ఆలోచించేవాడు ఒకడు ఉండాలి. ఈ ఆలోచించేవాడి గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

లోకానికి సంబంధించిన విషయాలు, పరమేశ్వరుడికి సంబంధించిన విషయాలు, అనేక విషయాలు మీరు ఆలోచిస్తున్నారు రైటే, ఈ ఆలోచించేవాడు ఒకడు నీలో ఉన్నాడు. ఈ ఆలోచించేవాడు గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీరు భగవంతుడి గురించి ఆలోచిస్తున్నారు రైటే, ఈ ఆలోచించేవాడు ఎవడు? ఇలా దేని వెనకాలో మనం వెళ్ళిపోతున్నాం కాని మీ లోపలికి మీరు ఎందుకు వెళ్ళరు? అది రమణమహర్షి అడిగేది. మీ ఆదర్శాలు మీరు విడిచి పెట్టుకోవక్కరలేదు. మీకు నచ్చిన రూపాన్ని మీరు ఆరాధన చేయండి. ఆరాధన విడిచి పెట్టమని చెప్పటం లేదు. కాని ఎవరొకరి కూడా వెనకాల పడి వెళ్ళే మీరు లోపలికి వెళ్ళకపోతే మీకు నిజం తెలియదు. లోపలకి వెళ్ళండి. Down deep down మీ హృదయంలో పరమాత్మ ప్రకాశిస్తోంది. మీకోసం ఎదురు చూస్తోంది. అయితే మీరు లోపలికి వెళ్ళకపోతే ఎవరికో ఒకరికి అనుయాయుడిగా ఉన్నంత మాత్రం చేత, అనుకరణ వల్ల మటుకు మీకు నిజం తెలియదు. మీరు లోపలకి వెళ్ళండి. ఎవడో ఒకడి

వెనకాల పరుగు పెట్టడం కాదు మీరు చేయవలసింది. మీరు లోపలకి వెళ్ళండి. నేను మీ హృదయంలో ప్రకాశిస్తున్నాను అని పరమాత్మ చెబుతున్నాడు. మీ మనసుని కనీసం ఒక అంగుళం అయినా లోపలకి దింపండి. కాని మీరు లోపలకి వెళ్ళకుండా మీ హృదయంలోకి మీరు ప్రవేశించకుండా, ఎక్కడైతే సత్యం ప్రకాశిస్తోందో అక్కడకు మీరు వెళ్ళకపోతే మీకు సత్యం తెలియదు. మీరు మంచి పనులు చేస్తే మీకు పుణ్యం వస్తుంది. చెడ్డ పనులు చేస్తే పాపం వస్తుంది. ఇదంతా మనసుకి సంబంధించిన విషయమే. ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలే. అయితే లోపలకి వెళ్ళడం కోసం మీరు శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి, ఆత్మ గురించి ప్రీతి పెంచుకోవాలి. ఆత్మ గురించి ఇష్టం పెంచుకోవాలి. ఆత్మ గురించి ఆప్యాయత పెంచుకోవాలి. ఎవరైతే మీరుగా ఉన్నారో, ఆ వస్తువు మీకు తెలియబడే వరకు మీకు అశాంతి విడిచిపెట్టదు. ఏ ఆత్మ అయితే మీరు అని భగవంతుడు గీతలో చెప్పాడో, ఆ వస్తువు మీకు తెలిసే వరకు మిమ్మల్ని ఆవేదన విడిచిపెట్టదు, ఆందోళన విడిచిపెట్టదు. కోరిక తోటి మనం పని చేస్తున్నాము. భగవంతుడు నువ్వు కోరిక విడిచిపెట్టు కోరిక మనలో ఎవరు విడిచి పెట్టలేకపోతున్నాం. ఏ పని చేసినా కోరిక తోటే మనం పని చేస్తున్నాము. కోరిక వల్లే దుఃఖం వస్తుంది. ఇదే కర్మ సముద్రం. స్వార్థాన్ని చంపుకోవడానికి ఎవడు ఇష్టపడడు. స్వార్థాన్ని విడిచి పెట్టకుండా దేవుడిని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం అంతా వృధా, వృధా, వృధా. ఎక్కడైతే స్వార్థం లేదో అక్కడ దేవుడు ఉన్నాడు. కాని స్వార్థాన్ని విడిచి పెట్టడానికి మనకి ఇష్టం లేదు. మన స్వార్థాన్ని మనం విడిచి పెట్టకుండా దేవుడిని పట్టుకోవడానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. ఇలా దేవుడు ఎన్నడూ దొరకడు. దేవుడు నీ హృదయంలో ఉన్నాడు. ప్రత్యక్షంగా ఉన్నాడు. ఎప్పుడూ ఉన్నాడు. అయితే నీ స్వార్థంలోంచి ఎప్పుడైతే నువ్వు విడువడ్డావో, స్వార్థాన్ని ఎప్పుడైతే నువ్వు వదులుకున్నావో, అప్పుడు నీలో ఉన్న ఆత్మ వ్యక్తం అవుతుంది. ఈ స్వార్థం ఎంతవరకు వచ్చింది మీరు చేసే పుణ్యాలు కూడా మీరు స్వార్థం కోసమే చేస్తున్నారు. మిమ్మల్ని మరచిపోయి మీ దేహాన్ని మరచి పోయి, మీ మనసుని మరచిపోయి, మీ ఇంద్రియాలని మరచిపోయి, మీరు మీ జీవితంలో ఒక్క మంచి పని చేశారా? ఈ మంచి పని చేస్తే పరలోకంలో నాకు ఈ సుఖం వస్తుంది. ఆ సుఖాన్ని నేను పొందవచ్చు అని ఆశించి మీరు ఈ లోకంలో ఏదైనా మంచి పనులు చేస్తున్నారు కాని మిమ్మల్ని మరచిపోయి చేసిన పని ఒక్కటి ఉందా మీ జీవితంలో, మీరు ఆలోచించండి. మంచి పని చేశాం అని మీరు అనుకుంటున్నారు ఆ మంచి పని వల్ల కూడా మీరు ఏదో ఆశిస్తున్నారు. ఏదో పుణ్యమో, ఏదో ఒకటి ఆశిస్తున్నారు. అది కూడా ఆశించకుండా మీరు చేసిన పని జీవితంలో ఒక్క పని ఉందా? మిమ్మల్ని మరచిపోయి మీ జీవితంలో ఎదుటి వ్యక్తికి ఒక్క వ్యక్తికి సహాయపడ్డారా మీరు అన్నాడు రామకృష్ణ పరమహంస. నీ స్వార్థాన్ని విడిచి పెట్టి నిన్ను నువ్వు మరచిపోయి, ప్రతిఫలం ఆశించకుండా

కనీసం నీ జీవితంలో ఒక్క జీవుడికి నువ్వు సహకరించావా? పని పనికోసం మీరు ఎప్పుడైనా చేస్తున్నారా? ప్రేమ ప్రేమకోసం మీరు ఎవరిని అయినా ప్రేమించారా? ప్రతిఫలాన్ని ఆశించే మనం మంచి పనులు చేస్తున్నాము. అందుచేత మనకి పుణ్యం రావచ్చు. అయితే పుణ్యాన్ని ఏమి చేస్తాం మనం మళ్ళీ అనుభవిస్తాం. అనుభవించినపుడు వాసన ఏర్పడుతుంది. మన వాసనే మళ్ళీ తలంపు కింద పుడుతుంది. ప్రతీ వాడికి ఆలోచన వస్తుంది. ప్రతీ వాడికి తలంపు వస్తుంది. మీకు వచ్చే తలంపు కాని మీకు వచ్చే ఆలోచన కాని మీకు బయట నుంచి వస్తుందా? లోపల నుంచి వస్తుందా? లోపల నుంచే వస్తుంది. లోపల ఎక్కడ నుంచి వస్తుంది. ఈ ఆలోచన, మీ హృదయంలోంచే వస్తుంది. మీ లోపల నుంచే వస్తుంది. బయట నుంచి రావటం లేదు. భగవంతుడి దగ్గర నుంచే ఇవన్నీ వస్తున్నాయి.

భగవంతుడి లోంచే మీకు ఆ తలంపు వస్తుంది, ఆలోచన వస్తుంది. మూలం భగవంతుడే. ఈ తలంపులు, ఆలోచనలు లోపల నుంచి వచ్చే ప్లేస్ ఒకటి ఉంది, ఏది ఆ place? ఆ place నువ్వు గ్రహించే వరకు, అది గుర్తించే వరకు నీకు భగవంతుడు ఏమిటో తెలియదు. అందుచేత మీ యొక్క మూలం దేవుడే. నువ్వు నీ తల్లి గర్భం నుండి బయటకు రావచ్చు, కాని నీకు మూలం దేవుడే. నువ్వు దేవుడి దగ్గర నుంచే వచ్చావు అందుచేత రమణస్వామి చెప్పేవారు, నన్ను ఏ దారిన వెళ్ళమంటారు వచ్చిన దారిన వెళ్ళు అనేవారు ఆయన, మనం ఎక్కడ నుంచి వచ్చాం? దేవుడి దగ్గర నుంచి వచ్చాం. మళ్ళీ వచ్చిన దారి నుంచి వెనక్కి వెళితే దేవుడి దగ్గరకే వెళతాం. నన్ను ఎలా బ్రతకమంటారు అని ఒకరు అడిగితే నువ్వు చచ్చిన వాడి వలే బ్రతుకు నీకు జ్ఞానం వస్తుంది అన్నారు. మన శరీరాలకి యవ్వనం వచ్చింది కాని మన మనసు ఇంకా వికసించలేదు. చచ్చిన వాడివలె బ్రతకడానికి ఈ అహంకారం ఊరుకుంటుందా? నీకు ఇదొక opportunity, ఇదొక అవకాశం. మనకున్న బలహీనతలు నుండి బయట పడటానికి ఈ అవకాశం మనకి ఇచ్చారు. పరీక్షలు ఎందుకు పాస్ అవ్వడానికి ఒక అవకాశం, పరీక్షలురాయకపోతే ఫెయిల్ అయిపోతారు. పరీక్ష బాగా రాస్తే పాస్ అవుతారు. అదొక అవకాశం. పై క్లాసు లోకి రావటానికి examination ఒక అవకాశం. అలాగే డబ్బు సంపాదించేవాడికి కూడా అనేక అవకాశాలు వస్తాయి. అవకాశం పట్టుకున్నవాడు డబ్బు సంపాదిస్తాడు లేకపోతే వాడు డబ్బు సంపాదించలేడు. మనకి ఈ మానవజన్మ అనేది ఒక అవకాశం. ఇదొక opportunity అయితే ఎందుకు ఈ అవకాశం? ఆత్మని తెలుసుకోవటానికి ఏ బలహీనతలు మనకి అడ్డు వస్తున్నాయో, ఆ బలహీనతలని తొలగించుకోడానికి ఈ మానవజన్మని అవకాశంగా తీసుకుని, వాటిలో నుండి బయటకి వస్తే వాడు జ్ఞాని అవుతాడు. ఈ అవకాశాన్ని విడిచి పెట్టుకున్నాం అనుకోండి ఇంక మనకి అవకాశం వస్తుందో రాదో చెప్పలేము, వచ్చినా బాగుపడతామో, లేదో చెప్పలేము. దీపం ఉండగానే చదువుకోమంటే చదువుకోలేని వాడు కరెంటు పోయిన తరువాత

చదువుకుంటాడా? హిందూమతంలో తరతరాల నుంచి అలవాటు పడిపోయింది ఏమిటంటే పూజ. ధ్యానం చేయమంటే కష్టమే. ధ్యానం చేయలేరు. పోని ఏదన్నా ఒక మంచి పని చెయ్యమంటే మంచి పని చేయటం కూడా కష్టమే. ఏవో పువ్వులు తీసుకొచ్చి దేవుడి పటం దగ్గర పెట్టి, ఏదో నాలుగు మంత్రాలు చదవచ్చు. అన్నింటికంటే తేలికైన పని ఏమిటంటే పూజ. మన అందరికి పూజే దేవుడు, పూజకి అలవాటు పడిపోయాం, పూజ చేయండి అయితే మీలో ఉన్న బలహీనతలు లోంచి మీ పూజ కాని, జపం కాని , ధ్యానం కాని బయటకు రావటానికి సహకరించిందా? అది చూసుకోండి. ఒక డాక్టరు గారు నా పొరపాటు ఏమి లేదు ఆపరేషన్ చాలా బాగా చేశాను, కానీ పేషెంట్ చచ్చిపోయాడు అన్నాడట. మరి నువ్వు చేసే పూజ, నువ్వు చేసే జపం, నువ్వు చేసే ధ్యానం చాలా బాగా చేస్తుంటే ఏ బలహీనత నీ హృదయం నుండి బయటకు వచ్చింది. మనిషి పుట్టినప్పుడు ఒక ఇరవై బలహీనతలతోటి పుడితే మీరు పూజ చేస్తారో, జపం చేస్తారో, లేకపోతే మీరు రాముడినే తలచుకుంటారో, కృష్ణుడినే తలచుకుంటారో ఏదో ఒకటి చేయండి, మీరు మరణించే లోపులో కనీసం ఒక్క బలహీనత తగ్గించుకుని పంతొమ్మిది బలహీనతలు తోటే మీరు మరణించండి. అప్పుడు ఆధ్యాత్మికంగా మీరు అభివృద్ధిలోకి వచ్చినట్టే. ఎందుకు ఈ అవకాశాలను మీరు ఉపయోగించుకోరు. మనకున్న బలహీనతలు అన్నీ ఎక్కడ నుంచి వచ్చాయి? పూర్వజన్మలో మనం చేసిన పనులే బలహీనతల కింద తయారు అయ్యాయి. అందరూ మనుషులే అంటున్నారు. మరి అందరూ మనుషులే అందరికి ఒకే ఆలోచన ఎందుకు రావటం లేదు. ఇంతమంది కూర్చొన్నాం ఎవరి ఆదర్శాలు వారివి. ఎవరి ఆకాంక్షలు వారివి, ఎవరి తలంపులు వారివి, ఎవరి ఊహలు వారివి, ఎవరి దృష్టి వారిది, అందరికి ఒకే తలంపు ఎందుకు రావటం లేదు ఎందుచేత మన పూర్వజన్మలు వేరు, మన పూర్వజన్మల్లో చేసిన పనులు వేరు. మనం పూర్వజన్మలో ఏ పని అయితే చేశామో ఆ పనే వాసన కింద మన హృదయంలో ఉండిపోయింది. ఆ వాసనే తలంపు కింద వస్తుంది. తలంపే మళ్ళీ మాటలా వస్తుంది. మాటను బట్టి పని చేస్తున్నాము. మీకు మాట వస్తుంది అనుకోండి తలంపు లేకుండా మీకు మాట వస్తుందా? ఆలోచన రాకుండా మాట వస్తుందా? ఆలోచన వచ్చాకే మాట వస్తుంది. ఆలోచన వచ్చాకే పని చేస్తున్నారు. అందుచేత మీరు మంచి పని

మీరు చిల్లర చింతలు చింతాకంతైనా చింతించవద్దు. నిరంతరము భగవంతుని భావనలో ఉండండి. మనకు మోక్షం ఇచ్చేది భగవంతుడు.ఆయన చెప్పిన పనిని చేసుకుంటూ వెళ్ళిపో.

చెయ్యాలి మీ నోటి నుండి మంచి మాట రావాలి ఆలోచన నియంత్రించుకోవాలి. మీ ఆలోచన మీ స్వాధీనంలో ఉందా? నా తలంపు నా స్వాధీనంలో లేదు. నా ఆలోచన నా స్వాధీనంలో లేదు. నేను దేశాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నం చేస్తున్నాను. తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? వాసన లోంచి తలంపు వస్తుంది. వాసన ఎక్కడ నుంచి వచ్చింది? మన హృదయం లోంచే వచ్చింది. అయితే లోపల ఆ వాసన ఉన్నట్టు మనకు తెలియదు. వాసన తలంపుగా మారి మన బ్రెయిన్ లో కనిపించినప్పుడు కాని మనకు తెలియదు. మనం ఏది చేసినా కోరిక తోటి పని చేస్తాం, నువ్వు కోరిక తోటి పని చేస్తే నీకు జ్ఞానం రాదు. నిన్ను నువ్వు మరచి పోయి నీ కోరికను కాదని, ఏదైతే మంచి అని భగవంతుడు చెప్పాడో, దానిని చెయ్యి, ఫలితం రావచ్చు, రాకపోవచ్చు అది వేరే విషయం. ఫలితం భగవంతుడు ఇవ్వను అని చెప్పలేదు. ఫలితం కోసం మిమ్మల్ని చూడొద్దు అని చెప్పాడు. మనం ఏమిటి ఫలితం ఆశించకపోతే రాదు అనుకుంటాము. మనం పని కనుక చేస్తే ఫలితం ఆశించక్కర్లేదు. దానంతట అది వస్తుంది అయితే మనం ఆశించకూడదు. ఆశిస్తే అజ్ఞానం పెరుగుతుంది. నా హృదయంలో శాంతి ఉంది ఆ శాంతి నాకు అనుభవంలో లేదు. ఎందుచేత? నా అజ్ఞానం మూసేస్తోంది.

నా హృదయంలో సుఖం ఉంది, అది నాకు అనుభవం లేదు. ఎందుచేత? నా కోరికలు మూసేస్తున్నాయి. అంతేగాని వస్తువు లేదు అని కాదు. ఒకసారి రమణమహర్షి దగ్గరకు ఒక అబ్బాయి వచ్చాడు. అబ్బాయి నీకు ఏమి కావాలి? అని అడిగారు భగవాన్. నాకు ఏమి అక్కర్లేదు అన్నాడు ఆ అబ్బాయి. అబ్బా ఎంత కాలానికి దొరికావురా నా జాతి వాడవు అన్నారట భగవాన్. అందరూ అన్నీ అడుగుతున్నారు కాని నువ్వు నాకు ఏమి అక్కర్లేదు అంటున్నావు ఎంత కాలానికి దొరికావు నా జాతి వాడవు. నిరంతరం మీకు మీరు జ్ఞాపకం వస్తున్నారా? దేవుడు జ్ఞాపకం వస్తున్నాడా? మన శరీరమో మన మనస్సో మనకి జ్ఞాపకం వస్తుంది. మీకు దేవుడు మీద నిజంగా ఇష్టం ఉంటే మీకు దేవుడు ఎందుకు జ్ఞాపకం రావటం లేదు. మీ మనవళ్ళి, మీ పిల్లల్ని జ్ఞాపకం పెట్టుకోవడానికి మీకు సాధన అక్కర్లేదు అస్తమాను వాళ్ళు జ్ఞాపకం వస్తూ ఉంటారు, ఎందుచేత అది మీకు ఇష్టమైన పని. దేవుడు మీకు ఇష్టం లేదు కాబట్టి సాధన చేయమంటున్నారు. ఇష్టం లేదు కాబట్టి మీరు కష్టపడి జ్ఞాపకం తెచ్చుకోవాల్సి వస్తుంది. అయితే మీకు నిజంగా ఇష్టం అయితే కష్టం ఎందుకు ఇక్కడ? ఇష్టం ఉన్న చోట కష్టం ఉండదు, ఇష్టం లేని చోట కష్టం ఉంటుంది. దేవుడు మీకు నిజంగా ఇష్టం అనుకోండి మీకు నిరంతరం భగవంతుడు జ్ఞాపకం ఉండాలి. మీకు అందరికి ఇష్టమే, నోటి తోటి ఇష్టం లోపల హృదయం తోటి కాదు. నోటి తోటి దేవుడు ఉన్నాడు అని చెబుతున్నారు. మళ్ళీ హృదయం తోటి కాదు అంటున్నారు. ఏ మాట అయితే మనం నోటి తోటి చెబుతున్నామో ఆ మాట హృదయం తోటి కాదు అంటున్నాం. ఒక

అరుణాచలం జ్ఞాపకమే చాలు మీకు మోక్షం వస్తుంది. ఆ జ్ఞాపకం ఏది? మరి మీకు దేవుడు ఇష్టం అయితే మీకు నిజంగా ఎందుకు జ్ఞాపకం ఉండటం లేదు? మీకు అందరికి ఏది జ్ఞాపకం వస్తుంది? మీకు ఏది అయితే ఇష్టమో, అదే మీకు జ్ఞాపకం వస్తుంది. దేవుడు మీకు ఇష్టం లేదు కాబట్టి, దేవుడు జ్ఞాపకం రావటం లేదు. ఆయన మీద మీకు ఇష్టం ఉందో లేదో తెలుసుకోలేని అమాయకుడా దేవుడు. జ్ఞానం తోటి సమానమైన వస్తువు కాని, జ్ఞానానికి మించిన వస్తువు కాని ఈ లోకంలో లేదు, పరలోకంలో కూడా లేదు. ఆ జ్ఞానం ఎవరు? నువ్వే. నీ స్వరూపమే జ్ఞానం అన్నాడు భగవంతుడు. అందుచేత మీరు జ్ఞానాన్నే గమ్యంగా పెట్టుకోండి. మనం ఏదైనా ప్రయాణం చేస్తున్నాము ఫలానా చోటుకి వెళ్ళాలి అనే ఇంటివద్ద బయలుదేరుతాము. మీరు ఎక్కడికి వెళుతున్నారు మాకు తెలియదు అని ఎవరైనా చెబుతారా. మీ గమ్యం ఏమిటి? జ్ఞానాన్నే మనం గమ్యంగా పెట్టుకోవాలి. అందుచేత మనం చేత్తోటి ఒక పని చేసినా, చెవులతోటి ఒక మాట విన్నా, కంటి తోటి ఏదైనా చూసినా, నాకు ఏదైనా తలంపు వచ్చినా అది జ్ఞానాన్ని సంపాదించటం కోసమే. జ్ఞానాన్ని గమ్యంగా పెట్టుకుని మనం పని చేస్తే జ్ఞానం వస్తుంది. మీకు దేవుడు కావాలా? దేవుడు ఇచ్చే వరాలు కావాలా? మీకు దేవుడు అక్కర్లేదు. దేవుడు ఇచ్చే వస్తువులు కావాలి. మీకు దేవుడు కావాలి అంటే దేవుడు దొరుకుతాడు కాని మీకు దేవుడు అక్కర్లేదు, ఏమి కావాలి? దేవుడు ఇచ్చే వస్తువులు మీకు కావాలి. అందుచేత దేహం మీరే అని మీరు తెలుసుకోవడానికి భగవద్గీత చదవాలా? వెనక ఒక ఊళ్లో ఒక పంతులు గారు వచ్చి గుళ్లో దేవుడు ఉన్నాడు. మీరు గుళ్ళో దేవుడి దగ్గరకు వెళ్లి నమస్కారం పెట్టుకోండి అని చెబుతున్నాడు. శాస్త్రం ఏమి చెబుతోంది మీ హృదయంలో ఉన్నాడు దేవుడు అని చెబుతోంది. గుళ్ళో దేవుడు ఉన్నాడు అని మీకు తెలుసు, నాకు తెలుసు, అందరికి తెలుసు. మరి గుళ్ళో దేవుడు ఉండి బయట లేకపోతే వాడు దేవుడు అవుతాడా? మీ హృదయంలో లేకపోతే దేవుడు అవుతాడా? గుడిలో ఉన్న దేవుడి మీద ఉన్న నమ్మకం మీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడి మీద మీకు నమ్మకం ఉందా లేదా మీరు ఆలోచించండి మీ గుండె మీద చెయ్యి వేసి. నన్ను నమ్మమని మీతో చెప్పటం లేదు. మీ మీద కనుక మీకు నమ్మకం కుదిరితే మీరు అందరూ ఈశ్వరుని స్వరూపం పొందుతారు. మీరు మంచి మాటలు వినాలి, వాటిని శ్రద్ధగా మననం చెయ్యాలి. విన్న విషయాలు మీ మనసులో తిప్పుకోవాలి, వాటిని ధ్యానం చేయాలి, భగవంతుడి నోటి లోంచి వచ్చిన మాటకి భగవంతుడికి బేధం లేదు. ఆయన చెప్పిన మాట భగవంతుడు వేరు కాదు. మాటే భగవంతుడు. ఆ మాటని పట్టుకుని మనం భగవంతుడిని చేరుకోవాలి. అందుచేత ఎవరుమటుకు వారు మీ హృదయంలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకోండి. పరిశీలనగా చూసుకోండి. కనీసం ఒక్క బలహీనతని మీరు బయటకి తీసేయడానికి ప్రయత్నం చెయ్యండి. మీకు దారి

కనిపిస్తుంది. నేను ఒక్క అరటి పండు మీ చేతిలో పెడితే మీరు ఒక అరటి పండు నా చేతిలో పెడితే అది త్యాగం కాదు. నిజమైన త్యాగి ఎవరు మీ హృదయంలో ఉన్న సంస్కారాలు, దురాలోచనలు, ఒక్క ఆలోచన విడిచి పెట్టండి. వంద దురాలోచనలు మీ హృదయంలో ఉంటే ఒక్క చెడ్డ ఆలోచన విడిచి పెట్టండి అది త్యాగం. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు.

ఏది త్యాగం చేయవలసింది? నీ హృదయంలో ఉన్నటువంటి పరమేశ్వరుడిని తెలుసుకోవటానికి, ఏ దుష్ట ఆలోచనలు, ఏ కుయుక్తులు, ఏ కుతంత్రాలు, ఏ కుచేష్టాలు, ఏ దుర్వాసనలు నీకు అడ్డు వస్తున్నాయో, వాటిని త్యాగం చెయ్యి, వాటిని విడిచి పెట్టు. తరచుగా వచ్చే ఒక చెడుతలంపుని మీరు విడిచి పెట్టండి. దానిని త్యాగం చేయండి. ఇపుడు అందరికి ఎవడి దేహం వాడికి అనుభవంలో ఉంది కదా, దీనికి ఉపనిషత్తులు చదవాలా, వేదం చదవాలా, భగవద్గీత చదవాలా ఏమి చదవక్కరలేదు. నువ్వు ఆత్మవు కాని దేహానివి అనుకుంటున్నావు. అందుచేత నువ్వు ఆత్మవు అని చెప్పటానికి శాస్త్రం వచ్చింది. నీకు తెలియని విషయం చెప్పటానికి శాస్త్రం వచ్చింది. నేను ఆత్మని అని భగవంతుడు చెబుతున్నాడు. అయితే ఎందుకు నేను నమ్మటం లేదు అది, ఆ మాట మీద విశ్వాసం ఎందుకు కుదరటం లేదు? దానికి కారణం ఒక్కటే, మన హృదయంలో ఉన్న పాపం. నా హృదయంలో పాపం ఉన్నప్పుడు మంచి మాటలు నేను వినలేను. నా హృదయంలో దోషం ఉన్నప్పుడు భగవంతుడు చెప్పే మాటలు మీద నాకు విశ్వాసం కలగదు. ఎందుచేత అంటే మనం పాపం అనే బురదలో ఉన్నాం, ఈ బురద లోంచి ఒడ్డుకు రాలేక పోతున్నాం. అందుచేత భగవంతుడు చెప్పే మాటలు నిజం అయినప్పటికీ అబద్ధాల కింద కనిపిస్తాయి. మనం అనుకునే అబద్ధాలు అన్నీ నిజం అనుకుంటున్నాం. ఇదే రమణస్వామి చెప్పారు ఒక అబద్ధాన్ని ఎన్ని సార్లు నిజం అనుకున్నా అది నిజం అవ్వదు. నువ్వు అనుకోవచ్చు అది నిజం అని కాని అది నిజం అవ్వదు. అయితే ఈ పాపం అనే బురద లోంచి ఎలా బయటకు రావటం? ఈ బురద లోంచి బయటకు రావాలి చేప లాగా ఎదురు ఈదాలి మనం. చేపలు ప్రవాహానికి ఎదురు ఈదుతూ ఉంటాయి. అదేవిధంగా మన మనస్సు యొక్క ప్రవాహానికి ఎదురు ఈదాలి, ఎదురు ఈదితే మూలం లోకి వెళతాం. ఎవడైతే పాపాన్ని జయించాలి అనుకుంటున్నాడో, వాడు మనసుకి ఎదురు ఈదాలి. మనసు ఎంతసేపు ప్రకృతి లోకి లాగుతుంది. నీ మనస్సుని నువ్వు కాదు అని భగవంతుని వైపు ప్రయాణం చెయ్యాలి అదే ఎదురు ఈదడం, మనస్సు ఎంతసేపు ఈ దేహం నాది ఈ దేహం నాది అంటూ ఉంటుంది. కాని నువ్వు ఆత్మవు, ఆత్మ వైపు తిరగటం లేదు. అది నిన్ను ఆత్మ వైపుకి తిరగనివ్వదు. ఎన్ని పుణ్యాలు చేయమన్నా చేస్తుంది, తనమీద విచారణ చేయడానికి అది అంగీకరించదు. పుణ్యం చేయమంటే చేస్తుంది, దానాలు చేయమంటే చేస్తుంది, కాని తానెవరో తాను తెలుసుకోవడానికి అది ఇష్ట పడదు. నువ్వు దేహానివి కాదు, నువ్వు

మనసువి కాదు, నువ్వు ఆత్మవి అని చెప్పటానికి శాస్త్రం వచ్చింది. మీకు నిజం తెలియటం లేదు. నువ్వు అబద్ధంలో ఉన్నావు కాబట్టి అబద్ధం నుండి విడిపించి నిజం దగ్గరకు తీసుకు వెళ్ళటానికి శాస్త్రం వచ్చింది. నేను అబద్ధం నుండి విడువడను అంటే నిజం దగ్గరకు వెళ్ళలేవు. నాకు జిన్నూరు వెళ్ళాలని ఉంది కాని వేంపాడు విడిచి పెట్టడం ఇష్టం లేదు అంటే జిన్నూరు ఎలా వెళ్ళగలను? అదేవిధంగా అజ్ఞానాన్ని విడిచి పెట్టడానికి ఎవడికి ఇష్టం ఉండదు. అజ్ఞానాన్ని విడిచి పెట్టకూడదు, జ్ఞానం తెలియాలి. అబద్ధాన్ని విడిచి పెట్టకూడదు, నిజం తెలియాలి. అహంకారాన్ని విడిచి పెట్టడానికి వీలు లేదు దేవుడు తెలియాలి అంటే ఎలా తెలుస్తుంది. అహంకారం ఉండగా అహంకారానికే పరిమితం అయిన నేనుకి, ఈ మనస్సుకి పరిమితం అయిన నేనుకి, ఈ దేహానికే పరిమితం అయిన నేనుకి, ఆత్మ గురించి తెలియదు, తెలియదు, తెలియదు. మనం అందరం నేను నేను అంటున్నాం కృష్ణుడు కూడా నేను నేను అన్నాడు గీతలో, అయితే కృష్ణుడు చెప్పిన నేనుకి, మనం చెప్పే నేనుకి తేడా ఏమిటి? మనది దేహగతమైన నేను, మనోగతమైన నేను, అహంకారగతమైన నేను ఆయన చెప్పిన నేను ఆత్మగతమైన నేను. నన్ను తెలుసుకో అర్జునా, నా యందు భక్తిగా ఉండు, నేను చెప్పిన మాటలు విశ్వసించు. అంటే కృష్ణుడి పొట్ట, కృష్ణుడి కాళ్ళు, కృష్ణుడి చేతులు తెలుసుకోమని కాదు, అక్కడ నన్ను ఆత్మను తెలుసుకోమని చెప్పటం. కొంతమంది కృష్ణుడు పటం, శివుడు పటం దగ్గర పువ్వులు పెడతారు, పళ్ళు పెడతారు. దేవుడికి మనం పళ్ళు ఇవ్వటం ఎందుకు అంటే మనకి మానవజన్మ అనే ఒక అవకాశం ఇచ్చాడు. కృతజ్ఞత చూపించటానికి మనం పళ్ళు ఇస్తున్నాం ఆయనకి, ఆయన ఈ పళ్ళు ఏమి చేసుకుంటాడు, పువ్వులు ఏమి చేసుకుంటాడు? మనం ఏదైనా ఒక పండు ఇస్తున్నాం కృతజ్ఞత చూపించటం కోసం, కొంతమందికి కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియదు, కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియని వాడు మరణిస్తే ఆ మనిషి యొక్క మాంసం కుక్కలకు కూడా నక్కలకు కూడా తినాలని ఉండదు. భగవంతుడికి మనం కృతజ్ఞత తెలియపరచటం కోసం పూజ చేస్తున్నాము, పళ్ళు పెడుతున్నాం, పుష్పాలు పెడుతున్నాం. అయితే నిజంగా దేవుడి పట్ల నువ్వు కృతజ్ఞత చూపించాలి నువ్వు ఆత్మను తెలుసుకో, ఆత్మగా ఉండు, అప్పుడు నువ్వు దేవుడికి నిజంగా కృతజ్ఞత చూపించగలవు. మనకు మూడు శరీరాలు ఉన్నాయి. ఈ దేహం స్థూలశరీరం.

రమణస్వామి అన్నారు ఈ మైకు ఎంతో, ఈ గోడ ఎంతో, ఈ దేహం అంతే. నేను నేను అని ఈ దేహం చెబుతోందా? దేహంలో ఉన్నవాడు ఎవరైనా చెబుతున్నాడా? దేహం చెప్పటం లేదు దేహానికి చెప్పే శక్తి ఉంటే శవం కూడా చెప్పాలి. మరి ఎవరు చెబుతున్నారు? దేహం లోపల ఉన్నటువంటి మనసు చెబుతుంది. దానిని ఏమంటారు? సూక్ష్మశరీరం అంటారు. దేహాలు మారొచ్చు, మనసులు మారొచ్చు, దానిలోపల ఇంకో శరీరం ఉంది ఏమిటది? కారణశరీరం. అది అజ్ఞానం. అజ్ఞానం తొలగనంతకాలం నిన్ను సృష్టి

విడిచిపెట్టదు. నీ హృదయంలో ఉన్న అజ్ఞానం బయటకి వచ్చేవరకు నీకు మాయ దారి ఇవ్వదు. మీకు మోక్షానికి వెళ్లటానికి రోడ్డు కనిపించదు. సోదరమహాశయులారా! భౌతికమైన లాభాలు మీకు అనేకం రావచ్చు. భౌతికంగా మీరు ఎన్నో సాధించవచ్చు. ఎన్నో achievements మీ జీవితంలో ఉండవచ్చు. కానీ మీరు అజ్ఞానం నుండి బయటకి రావడమే నిజమైన లాభం. ఎవడైతే తన అజ్ఞానాన్ని త్యాగం చేశాడో అజ్ఞానం అనే సంకెళ్లను తెంచి ఎవడైతే విడువడ్డాడో, అజ్ఞానం నుండి విడుదల పొందటం కంటే మించిన లాభం ఈ లోకంలో కాని, పరలోకంలో కాని లేనే లేదు. మీకు రూపాయలు ఉండవచ్చు, బంగారం ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, అధికారాలు ఉండవచ్చు, మీకు మేడలు ఉండవచ్చు, మీకు సౌందర్యం ఉండవచ్చు, మీకు అంగబలం ఉండవచ్చు, అర్థబలం ఉండవచ్చు. మీకు అన్నీ లాభాలే ఉండవచ్చు. కాని ఆత్మలాభం మీరు ఎవరైనా సంపాదించారా? దానికోసం ప్రయత్నం చెయ్యండి, ఒకవేళ మీకు ఫలించకపోతే బాధ పడకండి, కనీసం ఆ ప్రయత్నంలో మరణించండి. ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. ఈశ్వరుడు మిమ్మల్ని అజ్ఞానం నుండి విడిపించేలా చేస్తాడు. ఆత్మలాభం కంటే మించిన లాభం ఏదీలేదు? ఒకవేళ ఆత్మే కనుక నిజం కాకపోతే భగవంతుడు నిజం కాదు అని చెప్పేవాడు. ఈ దేహమే కనుక నిజం అయితే ఇదే నిజం అని చెప్పేవాడు. ఆయనకు అబద్ధం చెప్పవలసిన అవసరం ఏమిటి? స్వార్థం ఉన్న మనిషికి అబద్ధం చెప్పవలసిన అవసరం ఉంది. జ్ఞానికి కాని, దేవుడికి కాని అబద్ధం చెప్పవలసిన పని లేదు. నువ్వు ఈ దేహానివి అయితే నిజంగా ఈ దేహానివి అని చెప్పేవాడు. ఇవన్నీ ఏమి కాదు కాబట్టి నువ్వు ఆత్మవి కాబట్టి నువ్వు ఆత్మ అని చెబుతున్నాడు కాని, నువ్వు అనుకునేదే కనుక నిజం అయితే ఇదే నిజం అని దేవుడు చెప్పి ఉండేవాడు. దేవుడికి అబద్ధం చెప్పవలసిన పని లేదు, మనం అందరూ మోక్షంలోనే ఉన్నాం కాని వేంపాడులో ఉన్నాం అని అనుకుంటున్నాం. కారణం దేహం వేంపాడులో ఉంది కాబట్టి వేంపాడులో ఉన్నామండి అనుకుంటున్నారు. కొంతమంది ఏమి అనుకుంటున్నారు గుడి కట్టించి సత్రం కట్టించి మోక్షం కొట్టేద్దాం అని చూస్తున్నారు. నువ్వు సంపాదించటం వల్ల వచ్చేది కాదు మోక్షం. నువ్వు మోక్షంలోనే ఉన్నావు. మోక్షం నీ స్వరూపం. నువ్వు మోక్షంలో ఉన్నావు అన్న సంగతి నీకు తెలియటం లేదు. ఇది సంపాదించే వస్తువు కాదు. నిజంగా ఇది సంపాదించే వస్తువు అయితే ఆ మోక్షం కూడా తప్పనిసరిగా పోతుంది. ఒక ముసలమ్మ గారు భగవాన్ ని ఏమని అడిగారు మూడు గంటలకు నాకు ట్రైన్ ఉందిస్వామి, మీరు నాకు మోక్షం ఇచ్చేయండి. మోక్షం ఇచ్చేస్తే నేను వెళ్లిపోతా భగవాన్ అన్నారు మోక్షం మూట అనుకుంటున్నావా? నెత్తి మీద పెట్టుకుని పోవటానికి అన్నారు. మీ స్వరూపమే మోక్షం. ఇప్పుడు మనం మోక్షంలోనే ఉన్నాం. అయితే దేహబుద్ధి కారణంగా నేను మోక్షంలో ఉన్న సంగతి నాకు తెలియటం లేదు. రాముడు దేవుడు అని అంటున్నాం. రాముడు దేవుడు అని ఎందుకు అంటున్నాం. రాముడి శరీరం దేవుడు కాదు. రాముడిలో ఉన్న ఆత్మ

దేవుడు. రాముడిలో ఏ ఆత్మ అయితే ఉందో అది నీ హృదయంలో ఉంది. రాముడి యొక్క దేహం దేవుడు కాదు. అయితే తన హృదయంలో ఉన్న ఆత్మ తనకి తెలుసు. అందుచేత వాడిని దేవుడు అన్నారు. అదేవిధంగా నువ్వు కూడా దేవుడివి అయిపోతావు. ఎప్పుడు? నీ హృదయంలో ఉన్న ఆత్మ నీకు తెలిస్తే నువ్వు కూడా దేవుడివి అయిపోతావు. అప్పుడు దుఃఖం నీ ఒంటి మీదకి రాదు, మీ ఇంటికి రాదు. దుఃఖపడే వాళ్ళు అందరూ పాపాత్ములు అని, సుఖపడే వాళ్ళు అందరూ పుణ్యాత్ములు అని అనుకొంటారు. మనకి ఇక్కడ పుణ్యాత్ములు ఎక్కువ ఉన్నారా? పాపాత్ములు ఎక్కువ ఉన్నారా? కాని ఎవరైతే కష్ట పడుతున్నారో, ఎవరైతే మంచి కోసం దుఃఖపడుతున్నారో, వాళ్ల పాపాలు అన్నీ కరిగిపోతాయి. వాళ్ళు దుఃఖపడుతున్నట్టుగా మనకి అనిపించవచ్చు. వాళ్ల పాపం అంతా ఖర్చు అయిపోతుంది. కొంతమంది బంగారు పిచ్చుకలు లాగా మాకు చాలా బాగా వెళ్ళిపోతున్నాయి రోజులు అని అనుకోవచ్చు. వాళ్లకి పుణ్యం ఖర్చు అయిపోతుంది. పాపం ఖర్చు అవ్వటం మంచిదా? పుణ్యం ఖర్చు అవ్వటం మంచిదా?

మన హృదయంలో సమతుల్యత రావడానికిమన బలహీనతలే అడ్డువస్తున్నాయి. సమత్వదృష్టి రాకుండా సమంగా ఉన్న ఆత్మ తెలియదు. బేధబుద్ధి ఉన్న మనసుకి ఆత్మ తెలియదు. కలుషితమైన బుద్ధికి ఆత్మ తెలియదు. మీరు చేసే సాధన వల్ల మీబుద్ధి శుద్ధి అవ్వాలి. మీబుద్ధి శుద్ధి అవ్వకుండా జ్ఞానం ఎవరికీ రాదు. బుద్ధి నిర్మలం అవ్వాలి. సోదరమహాశయులారా! నిజంగా పాపం తోటి పోరాడాలి మీరు నిజంగా పాపం నుండి బయట పడాలి ఎంతో కొంత మీ హృదయంలోని శాంతి మీకు అందాలి. అప్పుడు మీ పాపం పోతుంది. ఈ దేహం పుట్టింది, ఈ దేహం చనిపోతుంది. ఈ తనువు పోగానే మరొక తనువు. దీనినే పునర్జన్మ అంటారు నువ్వేమి మారవు. దేహం మారుతుంది, ఇంకొక కొత్త దేహం వస్తుంది. కొంతమంది శరీరం పడిపోయిన తరువాత ఏదో ఒకటి సాధిద్దాం అని చూస్తారు. శరీరం పడిపోయిన తరువాత సాధించేది ఏమి లేదు. మళ్ళీ నీకు దేహం రావాల్సిందే, అందుచేత మీరు ఏదైనాసాధించాలి అనుకుంటే దేహం ఉండగానే



నీవు చేసే పని వలన నీకు శాంతచిత్తం రావాలి, అది నిన్ను జనన-మరణ చక్రం నుండి విడుదల చెయ్యాలి. నీవు కర్మను యోగంగా చెయ్యాలి. అది నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

సాధించాలి. ఒక ఇరవై రోజుల్లో, ముప్పై రోజుల్లో నేను చనిపోతాను అనుకోండి, చనిపోతే వేంపాడు ఎక్కడ ఉంది. వేంపాడు ఎక్కడ ఉంది ఇలా చూసుకుంటూ ఉంటాను. అలా ఎందుకు చూసుకుంటారు డబ్బై ఏళ్ళు నేను వేంపాడులో ఉన్నాను కదా, శరీరాన్ని కాల్చేశారు కాని మనసు కాలలేదు కదా. అందుచేత వేంపాడు ఏమైంది, దక్షిణ పొలం ఎలా ఉంది, ఉత్తర పొలం ఎలా ఉంది, ఇవన్నీ గుర్తుకు వస్తూ ఉంటాయి. చేలగట్ల వెంట తిప్పుతూ ఉంటుంది. ఇదంతా మీరు మరణించాక తెలుస్తుంది నేను చెప్పేది నిజమో, అబద్ధమో. అయితే రమణస్వామి ఏమి అన్నారు అంటే రాత్రులు మీకు వచ్చే కల పొట్టిది, ఈ కల పొడుగుది అన్నారు. రాత్రుళ్లు మనకి అందరికి కలలు వస్తాయి కదా అది పొట్టి కల. ఇది పొడుగు కల. కాని అదీ అబద్ధమే, ఇదీ అబద్ధమే. ఇప్పుడు జరిగేదంతా కల ఎవరైనా ఒప్పుకుంటారా? కలలో ఉన్నంత సేపు మీకు అది నిజం అనిపిస్తుందా? అబద్ధం అనిపిస్తుందా? నిజమే అనిపిస్తుంది. ఎప్పుడు అబద్ధం అనిపిస్తుంది? మీకు మెలకువ వచ్చాక ఓహో ఇదంతా అబద్ధం అనిపిస్తుంది. మీకు ఎవరికైనా పది రూపాయలు అప్పు ఇచ్చినట్టు నాకు కల వచ్చింది అనుకోండి పొద్దున్న వచ్చి నా పది రూపాయలు నాకు ఇచ్చేయమంటే ఇస్తారా మీరు అదేవిధంగా ఇది కలే, అయితే ఇది కల అని మనకి తెలియదు. ఎప్పుడు తెలుస్తుంది? నీలో ఉన్న ఆత్మని తెలుసుకున్నాక ఇదీ కలే అని తెలుస్తుంది. అయితే రమణస్వామి ఏమి చెబుతున్నారు అంటే ఓ పుల్లయ్యా నువ్వు మరణించావు అనుకో అది కల, నువ్వు జన్మించావు అనుకో అదీ కలే, ఇక్కడకూర్చొన్నావు అనుకో అదీ కలే, ఇవన్నీ స్వప్నంలో జరుగుతున్నాయి అని చెప్పారు. ఇదంతా కల అనుకో, కలలు ఎప్పుడు వస్తాయి? పగలు వస్తాయా, నిద్రలో వస్తాయా మనకు కలలు? ఇదంతా కల అన్నప్పుడు మనం నిద్రపోతున్నాం అని అర్థం, ఇప్పుడు మనం అందరం మెలకువగా ఉన్నామా? నిద్ర పోతున్నామా? రమణస్వామి చెప్పేది ఏమిటంటే నిద్రలోనే ఉన్నాము అని, ఏమిటి నిద్ర అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానం అనే నిద్ర నుండి బయటకి వచ్చినప్పుడు తెలుస్తుంది ఇది అంతా కల అని, ఆత్మ తెలిస్తే నీకు ఈ స్థూల, సూక్ష్మ శరీరాల బెడద ఉండదు. నీకు ఈ ప్రకృతి బెడద, ఈ సంసారం బెడద, ఈ అజ్ఞానం బెడద, ఈ పునర్జన్మ బెడద, ఈ కష్టాల బెడద, ఈ నష్టాల బెడద, ఈ శారీరకమైన, మానసికమైన రుగ్మతల బెడద, ఈ దుఃఖం యొక్క బెడద, ఏ బెడద ఉండదు. ఆత్మను తెలుసుకునే వరకు నీకు ఈ బెడదలు తప్పవు. ఆత్మను ఏ సెకనులో అయితే నువ్వు తెలుసుకున్నావో ఆ బెడదలు అన్నీ విడిచి పెట్టి పారిపోతాయి. ఆత్మను తెలుసుకొనే వరకు ఒక కష్టం పోతే ఇంకో కష్టం, ఒక నష్టం పోతే ఇంకో నష్టం, ఒక బాధ పోతే ఇంకో బాధ, ఒక లోకం పోతే ఇంకొక లోకం, ఒక శవం పోతే ఇంకొక శవం, ఒకటి తరువాత ఇంకొకటి వచ్చి నిన్ను పీడిస్తాయి. ఆత్మను తెలుసుకునే వరకు నీకు ఈ బంధం తప్పదు, ఈ బెడద తప్పదు, సోదరమహాశయులారా! ఇక్కడ కూర్చొన్న వారిలో ఎవరైనా సరే మీకు ఇష్టం లేకపోతే నా జీవితాన్ని మీరు కాదు

అనండి, మీకు ఇష్టం లేకపోతే నేను చెప్పే మాటలు మీరు కాదు అనండి, కాని నా అనుభవాన్ని మీరు కాదు అనవద్దు. రమణ భగవాన్ చెప్పిన మాటల్లో, ఒక్క మాటలో అస్పష్టత ఉంటే చెప్పండి. ప్రతీ మాటలోను స్పష్టత ఉంది. ఇది క్యాష్ బేరమే, అరువు బేరం మటుకు కాదు. మోక్షం పొందడం కోసం ఈ శరీరం పడిపోయే వరకు ఆగక్కర్లేదు. ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది మోక్షం, ఇప్పుడు మోక్షం లేకపోతే తరువాత ఎప్పుడో వస్తుంది అది నిజం కాదు. నిజం అనేది ఎప్పుడూ ఉంటుంది. ఆత్మ ఎప్పుడూ నిజమే. ఈ శరీరం ఇప్పుడు ఉంది, ఈ వేంపాడులో మనం అందరం కూర్చొన్నాం, ఇంకో యాభై సంవత్సరాలు అయిన తరువాత చూస్తే ఇందులో ఒక్కడు కనిపించడు. దేహాన్ని విడిచి పెట్టడం ఎవరికీ ఇష్టం లేదు, కాని దేహాలు అందరిని విడిచి పెట్టేస్తాయి, ఎందుచేత? అది నిజం కాదు. నా దేహమే నిజం అయితే నన్ను విడిచి పెట్టడానికి వీలు లేదు. నా మనస్సే నిజం అయితే నా భావాలు మారటానికి వీలు లేదు. ఇవాళ ఉన్న ఆలోచన రేపు లేదు. నా మనసులో ఆలోచనలు మారుతున్నాయి. తలంపులు మారుతున్నాయి. ఊహలు మారుతున్నాయి. ఆదర్శాలు మారుతున్నాయి, ఆశయాలు మారుతున్నాయి. ఆకాంక్షలు మారుతున్నాయి. ఇదే కనుక నిజం అయితే మారుతుందా? అందుచేత ఆత్మను తెలుసుకొనే వరకు ఈ అజ్ఞానం అనే బెడద తప్పదు. శరీరం అనే బెడద తప్పదు. నీ మనసులో ఉన్నటువంటి ఆందోళనలు, చిరాకులు, స్పర్ధలు, ద్వేషాలు, కక్షలు ఇవి తప్పవు. ఎప్పటి వరకు? పరమ పవిత్రం అయినటువంటి, ఉదాత్తమైనటువంటి, ఉన్నతమైనటువంటి ఆ సద్వస్తువు నీకు అనుభవంలోకి వచ్చేవరకూ ఈ బెడదలు తప్పవు. ఆత్మకి మించిన మతం లేదు, ఆత్మకి మించిన కులం లేదు, ఆత్మకి మించిన ఆదర్శం లేదు. నిజం శాశ్వతంగా ఉంటుంది. అబద్ధం శాశ్వతంగా ఉండదు. మీరు అనుభవించే శాంతే కనుక నిజం అయితే అది ఎప్పుడూ ఉండాలి. మరి శాంతి ఎందుకు చెరిగిపోతుంది? మీకున్న శాంతి నిజం అయితే permanent గా ఎందుకు ఉండటం లేదు? అయితే మీకు అప్పుడప్పుడు శాంతి వస్తుంది అది అహంకారం యొక్క కల్పితమే, అది నిజమైన శాంతి కాదు. మీకు అప్పుడప్పుడు సుఖం వస్తుంది అది అహంకారం యొక్క కల్పితమే. అది నిజమైనది కాదు, ఏది నిజమైన శాంతి? ఏది నిజమైన సుఖం? ఏది నిజమైన స్వరూపం? ఆత్మ. మీరు ఆత్మను తెలుసుకునే వరకు, domestic troubles కాని, domestic difficulties కాని, domestic disappointments కాని, ఏది తప్పవు, తప్పవు. మీరు దేవుడిని తెలుసుకోకపోతే దేవుడికి నష్టం లేదు. మీ సుఖం కోసం, మీ స్వాతంత్ర్యం కోసం, మీ శక్తి కోసం, మీరు సుఖ పడటం కోసం, మీ శాంతి కోసం మీరు దేవుడిని తెలుసుకోవాలి కాని, మీరు తెలుసుకోకపోతే దేవుడికి వచ్చే నష్టం ఏమి లేదు. నువ్వు దేహానివి అనుకుంటున్నావు కాబట్టి నువ్వు పరిమితం అయిపోయావు. దేహం నుంచుంటే నుంచున్నాను అని, కూర్చుంటే కూర్చున్నాను అని, నడుస్తుంటే నడుస్తున్నాను అని, రోగం

వస్తే నాకు రోగం వచ్చింది అని, నువ్వు దేహానివి అనుకుంటున్నావు కాబట్టి నువ్వు పరిమితం అయిపోయావు. కొంతమంది ఏమంటారు మేము రాజులం అంటారు. దేహం రాజులా? లేకపోతే మీరు రాజులా? రమణమహర్షి నువ్వు ఎవరో తెలుసుకో నువ్వు ఎవరి అబ్బాయి అని కాదు నువ్వు ఎవరి అమ్మాయి అని కాదు లేకపోతే మీరు రాజులా, ఇంకో వర్ణమా అని కాదు నువ్వు నేను నేను అంటున్నావు. ఆ నేను ఎవడో నువ్వు చెప్పమని, రమణమహర్షి అడిగేది నీ కులం కాదు, నీ జాతి కాదు, నీ మతం కాదు, నీ దేశం కాదు, నీ లింగం కాదు, ప్రతీ మనిషి నేను నేను అంటున్నాడు. ఆ నేను ఎవరో తెలుసుకో, అంతేగాని మీరు బ్రాహ్మణులా, రాజులా, కాపులా అని కాదు. నువ్వు నేను నేను అంటున్నావు. ఆ నేను ఎవరో నీకు తెలుసా? ఆ నేను ఎవరో నీకు తెలియకపోతే దేవుడు ఎవరో నీకు తెలియదు. ఎందుచేత అంటే ఈ నేనుకి సోర్స్, దేవుడు మాత్రమే. ఆ నేను గురించి నీకు తెలియకపోతే దేవుడు గురించి నీకు తెలియదు. ఒకవేళ తెలుసుకున్నాను అని నువ్వు అనుకుంటే అది అబద్ధం. దేనికైతే పరిమితి లేదో అది ఆత్మ, దేనికైతే పరిమితి ఉందో, అది అహంకారం. అందుచేత నువ్వు పరిమితులు ఛేధించుకుని వెళ్ళు, అపరిమితమైన ఆత్మ నీకు అందుతుంది అంటున్నారు రమణస్వామి.

The greatest achievement, noblest achievement నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకోవడమే, నువ్వు ఎవడో నువ్వు తెలుసుకోకుండా నేను జీవితంలో ఏదో సాధించాను అంటే సాధించవచ్చు అది స్వప్నంతో సమానం. అది నిజం కాదు. మన మనసు కోతి లాంటిది, కోతి ఏమి చేస్తుంది ఒక రొబ్బ మీద నుంచి ఇంకో రొబ్బ మీదకి ఉరుకుతూ ఉంటుంది. నా మనసు కూడా ఏమి చేస్తుంది అంటే ఒక తలంపుని పట్టుకుంటుంది ఇంకో తలంపు మీద ఉరుకుతుంది. కోతి లాగ అలా ఉరుకుతూ ఉంటుంది, అందుచేత శంకరాచార్యుల వారు కాశీ వెళ్లి ఏమని చెప్పారు, ఓ విశ్వనాధస్వామి నువ్వు నాకు మోక్షం ఇవ్వద్దు, నిన్ను ఏమి అడగటం లేదు కాని నా దగ్గర ఉన్నది ఒకటి నువ్వు తీసేసుకో, నువ్వు తీసేసుకుంటే నాకు లాభం, నీకు లాభం అన్నారు. ఏమిటంటే ఎవడైనా కోతిని పెట్టుకుని అడుక్కోవడానికి వచ్చాడు అనుకోండి ఇంకో దోసెడుబియ్యం ఎక్కువ వేస్తాం. నా మనస్సు అనే కోతిని నువ్వు తీసేసుకో, తీసేసుకుంటే నాకు ఈ మనసు పీడ వదిలి పోతుంది. ఈ అజ్ఞానం పీడ వదిలిపోతుంది. అది నాకు లాభం. అయితే నీకు లాభం ఏమిటంటే నా మనసు అనే కోతిని నువ్వు కూడా తీసుకుని అడుక్కోవడానికి వెళ్ళవచ్చు నీకు ఎక్కువ బియ్యం దొరుకుతాయి. ఈ మధ్యన ఒక పెద్ద మనిషితోటి మీ ఊర్లో ఉన్న సత్పురుషుల తోటి సహవాసం చేస్తూ ఉండండి లాభం పొందుతారు అని చెప్పాను. మా ఊర్లో సత్పురుషులు ఎవరు ఉన్నారు? కొబ్బరి చెట్లు, తాటి చెట్లు పెద్ద మనుషులు అన్నాడు. నేను ఒక అందుకు చెబుతుంటే ఆయన ఇంకో లాగ ఆయన చెబుతున్నాడు, ఆయనకి ఏమి

బాధ ఉందో నాకు ఏమి తెలుసు? భగవంతుడు ఏమైనా చెబుతున్నప్పటికీ మన మనసులో ఉన్నది అందులో కనిపిస్తూ ఉంటుంది. భగవద్గీత చదివేటప్పుడు కృష్ణుడు ఏమి చెప్పాడో అది మనకు కనపడదు, మన మనసులో ఉన్నది భగవద్గీతలో కనిపిస్తుంది. భగవద్గీత అందరికి నోటికి వచ్చేసిందా, చదవటం మానకండి, చదవండి, చదివితే పుణ్యం వస్తుంది. చదివింది మీకు అర్థం అయ్యి ఆచరిస్తే మోక్షం వస్తుంది.

జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం. ఆ ఐశ్వర్యం నువ్వు సంపాదించకుండా శరీరం విడిచి పెట్టేస్తావు అనుకో ఈ శరీరం ఎందుకు వచ్చినట్టు? వంద బస్తాల బియ్యం తినడానికా? పుట్టటం నువ్వే కాదు చెట్లు కూడా పుడుతున్నాయి. అయితే నువ్వు మనిషి జన్మ ఎత్తినందుకు నువ్వు సాధించింది ఏమిటి? నీకు భగవంతుడు బుద్ధి ఇచ్చినందుకు సాధించింది ఏమిటి? అందుచేత భగవంతుడు నీకు బుద్ధి ఇచ్చినందుకు జ్ఞానాన్ని సంపాదించు. జ్ఞానాన్ని సంపాదించకుండా కనుక నువ్వు శరీరం విడిచి పెడితే విపరీతమైన నష్టాన్ని పొందుతావు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకో, అందుచేత నువ్వు జ్ఞానాన్ని సంపాదించు, నువ్వు మోక్షాన్ని పొందు. మేము ఈ మధ్యన చాలా మంచి పనులు చేస్తున్నాము అంటారు. రైటే మీరు చేసిన మంచి పనుల వల్ల మీ మనసు ఏమైనా బాగుపడిందా? మనల్ని ఎవరైనా పొగిడితే పది రూపాయలు ఇచ్చేది వంద రూపాయలు ఇస్తాం. పొగుడుతుంటే ఉబ్బి పోతున్నాం మన అజాగ్రత్తే కారణం. దేవుడు ఎప్పుడు అజాగ్రత్తగా ఉండడు. దేవుడు జాగ్రత్తగా ఉంటాడు. అందుచేత మీరు రోజు పొద్దున్నే లేచి ఎన్ని దండకాలు చదివినా మీరు ఎందుకు దండకాలు చదువుతున్నారో, మీ మనసులో ఏముందో, మీ తలంపులో ఏముందో, అది దేవుడు చూస్తూనే ఉంటాడు. మీ పొగడ్తలకి లొంగిపోయి మీకు మోక్షాన్ని ఇవ్వడు. మీరు అజాగ్రత్తగా ఉండవచ్చు కాని దేవుడు మటుకు అజాగ్రత్తగా ఉండడు. దేవుడు ఎప్పుడూ జాగ్రత్తగానే ఉంటాడు. నీ దండకాలకి దేవుడు మోసపోవటానికి దేవుడు అమాయకుడు కాదు. అయితే ఆయన మీ sincerity ని చూస్తాడు. మీ హృదయాన్ని పరిశీలిస్తాడు. మీరు ఎంతవరకు పక్వానికి వచ్చారు? మీ మనసు ఎంతవరకు పక్వానికి వచ్చింది? మీ శీలం ఎంత బాగుంది. మీకు ఎంత ఇంద్రియనిగ్రహం ఉంది. ఎంత మీ మనసు నిగ్రహంలో ఉంది. మీరు ఎంత సరళమైన జీవితం జీవిస్తున్నారు. ఎంత ఉదాత్తంగా జీవిస్తున్నారు. మీ

భగవంతుని సంకల్పమే నీ సంకల్పంగా చేసుకొని జీవిస్తూ ఉంటే దేహబుద్ధి నీకు తెలియకుండానే నశిస్తుంది.

మనసు ఎంత ఆరోగ్యంగా ఉంది మీ మనసులో ఎంత సౌందర్యం ఉంది. మీ మనసు నిజంగా నిర్మలంగా ఉందా లేదా అది చూస్తాడు కాని దేవుడు మీరు బాహ్యంగా చేసే పూజలు కాని, జపాలు కాని, మీ నమస్కారాలు కాని చూడనే చూడడు. దేవుడిని మోసం చేయడానికి ఎవరు ప్రయత్నం చేయవద్దు. దేవుడు అజాగ్రత్తగా ఉండే సమస్య ఉండదు. సోదరమహాశయులారా! మీరు ఏది మాట్లాడినా, ఏ పని చేసినా బాహ్యంగా చూడడు. మీరు పని చేసేటపుడు మీ దృష్టి ఏమిటి? మీరు మాట మాట్లాడేటప్పుడు మీ దృష్టి ఏమిటి? మీ దృష్టిని చూసి మీకు మోక్షాన్ని ఇస్తాడు. మేము చాలా మంచి పనులు చేస్తున్నాము అని చాలామంది అంటున్నారు. మీరు నిజంగా చేసేది మంచి పని అయితే మీ మనసు బాగుపడిందా? మీరు వాడే మందు కనుక మీ రోగానికి పని చేసే మందు అయితే మీ రోగం తగ్గాలి కదా, అదేవిధంగా మీరు చేసే పనులు కనుక నిజంగా మంచి పనులు అయితే మీ మనసు బాగుపడిందా? మీ మనసు సంస్కరించబడిందా? మీరు చేసే పనులు కనుక మంచి పనులు అయితే మీ మనసు ఎందుకు బాగుపడలేదు. మీ ధ్యానాలు నిజం అయితే, మీ జపాలు నిజం అయితే మీ మనసు ఎందుకు బాగుపడటం లేదు? మీరు చేయండి నేను వద్దు అనటం లేదు. ఇవన్నీ మీ మనసు బాగుపడటం కోసమే. మీరు చేసేదే కనుక నిజం అయితే మీ మనసులోకి ఎందుకు సౌందర్యం రావటం లేదు? మీ మనసు ఎందుకు బాగుపడటం లేదు? పరమేశ్వరుడి ప్రీతికోసం కాకుండా మీ గౌరవాల కోసమే మంచిపనులు చేస్తే మీరు పరలోకానికి వెళ్లిన తరువాత భూలోకంలో మాకు చాలా గౌరవం ఉంది అంటే మీరు ఎవరో నాకు తెలియదు, బయటకు వెళ్లండి అని బయటకు తోలేస్తాడు పరమేశ్వరుడు. గౌరవం కేవలం ఈ లోకానికి సంబంధించినది. నువ్వు ఆత్మ, అయితే నీకు దుఃఖం ఎందుకు వస్తుంది? ఈ దుఃఖపడేవాడు ఎవడు? వాడే అహంకారి. మనకి ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి మనం ఏడుస్తాం. మన బంధువులు ఎవరైనా పోయారు అనుకోండి మనం ఏడుస్తాం. లోపల ఉండి ఏడ్చేవాడు ఎవడు? అహంకారం ఏడుస్తుంది అయితే నువ్వు ఆత్మ అని చెప్పాడా భగవంతుడు అహంకారం అని చెప్పాడా? ఆ ఏడ్చేది నువ్వు కాదు నువ్వు ఆత్మవి. మీ అందరికి తెలిసినా, మీకు తెలియకపోయినా మీరు అందరూ మోక్షంలోనే ఉన్నారు. అయితే మనం చేయవలసిన పని ఒక్కటే. మనం మోక్షంలో ఉన్న సంగతి మనకి తెలియాలి. అదే ఇప్పుడు మన సాధన యొక్క లక్ష్యం. ఈ సాధన యొక్క గమ్యం. నేను ఫలానా సుబ్బమ్మని, ఎల్లమ్మని అని నువ్వు అనుకుంటున్నావు. అందుచేత మళ్లీజన్మ నాకు ఏజన్మ వస్తుంది అని అడుగుతున్నారు, నువ్వు ఆత్మ అని తెలిస్తే నీకు పునర్జన్మ గొడవ ఏముంది? కొంతమంది భగవాన్ దగ్గరకు వెళ్లి మా పూర్వజన్మ ఏమిటి అని అడిగేవారు. మీ పూర్వజన్మ ఏమిటో మీరు చెప్పమంటే చెబుతాను. కాని ఈజన్మ కష్టాలే మీరు భరించలేక పోతున్నారు. పూర్వజన్మ పిల్లల గొడవ, పూర్వజన్మ సంసారాల

గొడవ మీరు మోయగలరా? ఈజన్మలో గొడవలే భరించలేక పోతున్నాం. పూర్వజన్మలో గొడవలు కూడా మీకు నేను చెబుతాను అనుకోండి ఈ కష్టాలకి తోడు ఆ కష్టాలు కూడా ఎందుకు అన్నాడట ఆయన, పరమేశ్వరుడు దయకలవాడు కాబట్టే మీకు ఆ మరుపును పెట్టాడు. రమణమహర్షి గారి దగ్గరకు వచ్చి అడిగేవారు ఎవరైనా నాకు మళ్ళీ జన్మ ఏమిటి అని, మళ్ళీ జన్మ ఏమిటి అని అడుగుతున్నావు నువ్వు అసలు పుట్టావా? ఇపుడు నువ్వు పుడితే మళ్ళీజన్మ ఏజన్మ అని అడగవచ్చు. నువ్వు అసలు పుట్టావా? అదేంటండి నేను పుట్టక పోవడం ఏమిటి, ఎవరు పుట్టారు? దేహం పుట్టిన మాట రైటే, దేహానివా నువ్వు?

దేహం పుట్టినప్పుడు నువ్వు పుట్టలేదు అందుచేత దేహం మరణించినప్పుడు నువ్వు మరణించవు. అయితే నేను అనే భావన ఎప్పుడైతే పుట్టిందో అప్పుడు నువ్వు పుట్టావు. మరి ఎప్పుడు మరణిస్తావు? ఈ నేను అనే తలంపు ఎప్పుడైతే పోయిందో అప్పుడు మరణిస్తావు. ఈ నేను కొంచెం కూడా లేని చోటే స్వరూపం ఉంది. మనకి ఎంతసేపు అబద్ధం చెబితే ఇష్టం, నిజం చెబితే ఇష్టం ఉండదు. ఎందుచేత మన మనసు అబద్ధం కాబట్టి ఈ అహంకారాలు, కనిపించే అనుభవాలు నిజం కాదు. ఉన్నది ఒక్కటే అనుభవం. అదే ఆత్మ. అందరూ ఇంటికి వెళ్ళిపోతారా, పక్షి చాలా స్పీడ్ గా ఎగిరిపోతూ ఉంటుంది, ఎంత బలంగా ఎగిరిపోయినప్పటికీ దాని స్వస్థానానికి వచ్చి చేరుకుంటే కాని దానికి శాంతి లేదు. ఈ ఇల్లు మనకి నిజమైన ఇల్లు కాదు. నిజమైన ఇల్లు ఏమిటి? మన ఆత్మ. ఆ ఇంటికి చేరుకునే వరకు ఈ ప్రయాణాలు తప్పవు మనకి, ఈ ఆందోళన తప్పదు, ఈ అశాంతి తప్పదు. ఈలోపు ఎన్ని శవాలలో తిరిగినా, ఎన్ని ఊర్లు తిరిగినా, ఎక్కడకు తిరిగినా, మన ఇంటికి మనం వెళ్ళాల్సిందే. అది మర్చిపోకండి. మన అడ్రసే మనం మర్చిపోయాము. నువ్వు ఎవరో తెలియచెప్పటం కోసమే అనేకమంది అవతార పురుషులు , యోగులు, జ్ఞానులు, ఋషులు ఈ భూమి మీదకి దిగి వచ్చారు.

ఉన్నది ఒక్కటే వస్తువు. అది ఆత్మ దానిని మరచిపోవటం వల్ల ఈ గందర గోళం అంతా నా బుర్రని పట్టుకుంది. గౌరవాలు, అగౌరవాలు, లాభాలు, నష్టాలు, గొప్పలు, తిప్పలు, ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలు, ఆత్మకి సంబంధించినవి కాదు. ఉన్నది ఒక్కటే వస్తువు. దానిని మరచిపోయాం మనం. మనం ఎవరో మనకి తెలియటం లేదు. అందుచేత ఇవన్నీ మనలని పట్టుకున్నాయి. మన గడపే మనం దాటలేనప్పుడు భీమవరం ఎలా వెళతాం? అలాగే నా అజ్ఞానాన్ని నేను దాటలేకపోతే, నా అహంకారాన్ని నేను దాటలేక పోతే నాకు నిజం ఎలా తెలుస్తుంది? నాకు విడుదల ఎలా వస్తుంది? నేను నా ఇంటికి ఎలా వెళ్ళగలను? నేను మోక్షాన్ని ఎలా పొందగలను? దేవుడు పూర్వం ఉన్నాడు ఇప్పుడు లేడు అని మీరు ఎవరు అనుకోవద్దు. దేవుడిని విడిచి పెట్టి ఈ లోకం లేదు. దేవుడి లోనే ఈ ప్రపంచం ఉంది. ఆత్మలోనే ఈ ప్రపంచం ఉంది. పరమాత్మను విడిచి పెట్టి ఒక్క సెకను కూడా ఈ

లోకం ఉండదు. సోదరమహాశయులారా! ఐన్ స్టీన్ అనే ఒక mathematician చెప్పాడు దేహపరిధిలోంచి ఎవడైతే విడుదల పొందలేడో, వాడికి సత్యం తెలియదు. అది హృదయంలోనే ఉంది, నీకు దగ్గర లోనే ఉంది కాని నీకు తెలియదు. స్థూలబుద్ధికి ఆత్మ తెలియదు. సూక్ష్మబుద్ధికి ఆత్మ తెలుస్తుంది. నీకు వినయం ఉండాలి, పవిత్రత ఉండాలి. ఇవన్నీ ఎందుకు అంటే నీ హృదయంలోని ఆత్మని తెలుసుకోవడానికే. మీరు చేసే పూజలు, యాగాలు, యజ్ఞాలు అన్నీ ఆత్మను తెలుసుకోవడానికే. మీరు రాత్రులు రోజు మంచం ఒకటి, మంచం పైన పరుపు ఒకటి, పైన ఫ్యాన్. ఇవన్నీ వేసుకుంటున్నారా? ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు మంచం ఎందుకు? పరుపు ఎందుకు? పైన ఫ్యాన్ ఎందుకు? తల కింద దిండు ఎందుకు? ఇవన్నీ ఎందుకు అంటే నిద్ర పట్టడానికే, అయిన కాని నిద్ర పట్టకపోతే వీటి ప్రయోజనం లేదు. అదేవిధంగా మీరు పూజలు చేసినా, జపాలు చేసినా, సహవాసాలు చేసినా, ధ్యానాలు చేసినా మీరు ఆత్మని తెలుసుకోవటానికే, ఇవన్నీచేసినప్పటికీ మీకు ఆత్మ తెలియకపోతే అంతా సున్నా, బండి సున్నా. ఈ అజ్ఞానం అనేది పెద్ద బురద. ఈ అజ్ఞానం అనే బురద లోంచి పైకి రండి. మీకు నచ్చిన గురువును మీరు ఆశ్రయించండి. మీకు నచ్చిన మార్గంలో మీరు ప్రయాణం చేయండి. మీకు నచ్చిన దేవుడిని మీరు పూజించండి. కాని బురద లోంచి బయటకు రండి. మీరు రాముడిని ఆరాధిస్తున్నారా, కృష్ణుడిని ఆరాధిస్తున్నారా అది కాదు. మీకున్న దుఃఖం తగ్గాలి. మీరు సంతోషంగా ఉండాలి. మీరు సుఖంగా ఉండాలి. మీరు శాంతిగా ఉండాలి. అదే నేను కోరుకునే ప్రయోజనం. అంతే కాని మిమ్మల్ని ఎవరికో ఒకరికి బానిసలుగా తయారు చేయటానికి నేను ఊరూరూ తిరగటం లేదు.

రమణ భాస్కర చందాదారులకు విన్నపం

రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

సంవత్సర చందా రు॥ 150/-లు. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

శ్రీమద్భగవద్గీత

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 2:48 ॥

తాత్పర్యము : ఓ ధనంజయ! యోగస్థితుడవై ఆసక్తిని వీడి, జయాపజయముల యెడ సమత్వ భావమును కలిగి యుండి కర్తవ్య కర్మలను ఆచరింపుము. ఆ సమత్వ భావమునే యోగమందురు.

సమానబుద్ధి కలిగిన వాడినే యోగి అంటారు. హెచ్చుతగ్గులు లేనివాడు, నిదానంగా ఉన్నవాడు, రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు లేనివాడికి సమానబుద్ధి ఉంటుంది. వాళ్ల ఆలోచన నిర్మలంగా ఉంటుంది, నిశ్చలంగా, నిదానంగా ఉంటుంది. వాళ్ళు ఏదో ఒకవైపు ఒరిగిపోరు. ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే, నువ్వు యోగంలో ఉండి పని చెయ్యి, అప్పుడు నువ్వు చేసే పని నిదానంగా ఉంటుంది. నువ్వు పని చేస్తూ ఉండు కాని ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి వలన మనకు కొన్ని మానసిక అనారోగ్యాలు వస్తాయి. పని జడం, నువ్వు చేసిన పని వలన జయం కలగవచ్చు జయం కలగకపోవచ్చు. కాని చేసే పని మటుకు ఆసక్తి లేకుండా చెయ్యి, ఫలకాంక్ష లేకుండా చెయ్యి. మనందరిలో దోషం ఎక్కడుందంటే, మనకు కోరిక ఉంటే ఫలం వస్తుంది, కోరిక లేకపోతే రాదు అనుకుంటాము. కోరికకు శక్తి లేదు. మన ప్రారబ్ధంలో ఫలం వచ్చేది ఉంటే వస్తుంది లేకపోతే రాదు. దేహం యొక్క ప్రారబ్ధం బలీయమైనది. కొంతమందికి సామాన్యంగా చిన్న పని చేసినా ఎక్కువ ఫలితం వస్తుంది. కొంతమంది చాలా కష్టపడతారు, కాని ఎక్కువ కష్టపడినా, చిన్న ఫలితం వస్తుంది. ఆ పని నీకు ఫలితాన్ని ఇవ్వలేదు, ఫలితం ఇచ్చేది చైతన్యం.నేను ఇంత కష్టపడ్డాను కదా నాకు ఇంత ఫలితం రావాలి అని లెక్కలు వేసుకోవటం కుదరదు.కర్మ ఫలాన్ని భగవంతుడు పంచుతాడు. ఇదంతా ఈశ్వరుని యొక్క నిర్ణయం.

శరీరంతో బయటకి కష్టపడుతున్నావు కాని, అసలు ఆ పని చేసేటప్పుడు నీ ఉద్దేశం ఎలా ఉంది, లోపల ఎలా ఉన్నావు? అది ముఖ్యం. ఒక మనిషి విలువ వాడి దగ్గరున్న డబ్బునిబట్టి కాని, వాడి చదువుని బట్టి కాని, అంతస్థుని బట్టికాని, సోషల్ స్టేటస్సును బట్టికాని, వాడి పాండిత్యాన్ని బట్టికాని, బాహ్యంగా దేనిమీద ఆధారపడి లేదు. వాడు లోపల హృదయంలో

ఎలా ఉన్నాడు అనే దాని మీద మనిషి యొక్క విలువ ఆధారపడి ఉంటుంది అని అరవింద ఘోష్ చెప్పారు. నువ్వు పని చేస్తున్నావు, రైటే కాని నీ హృదయంలో ఏముంది? నువ్వు గౌరవం కోసం చేస్తున్నావా, కీర్తికోసం చేస్తున్నావా? లేకపోతే పని కోసమే చేస్తున్నావా, అని భగవంతుడు చూస్తాడు. ఈశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు కదా!

ఇంకొక నిమిషంలో మనకు ఏమి తలంపు వస్తుందో మనకి తెలియదు. అది ఈశ్వరుడికి తెలుసు. మీరందరూ మంచివారే, కాని మీ లోపల ఏ బర్డెన్స్ ఉన్నాయో, పునర్జన్మ కారణాలు ఏమి ఉన్నాయో మీకు తెలియదు. అది ఈశ్వరుడికి తెలుస్తుంది. ఎప్పుడు ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. ప్రతిదీ ప్రతిక్షణం కూడా ఈశ్వరనిర్ణయం ప్రకారం జరుగుతుంది. అసలు మనము లేము, ఉన్నది ఈశ్వరుడే!

యోగస్థః కురు కర్మాణి - యోగంలో ఉండి నువ్వు పని చెయ్యి. నువ్వు ఆసక్తి ఏమీ పెట్టుకోవద్దు. చాలా మంది మా పిల్లలని బాగా చదివించామండి అంటారు. వాళ్లకి చదువు రాకపోతే మీరు చదివించగలరా? మనమేదో మామూలుగా బయటినుంచి సపోర్ట్ ఇచ్చాము అని తెలియటంలేదు. ఇదంతా మాయ, మేము వాళ్లని పైకి తీసుకొచ్చాము అంటారు, అది తప్పు అన్నాడు గీతలో. ఊరికే మీరు అవకాశం కల్పిస్తున్నారు అంతే, వాళ్లంతట వాళ్ళు అభివృద్ధిలోకి వస్తారు. అసలు వాళ్ళు ఆ స్థితికి రావాలని ఉంటే మీరేమీ సహాయం చేయకపోయినా, ఇంకొకళ్ళ చేత సహాయం చేయిస్తాడు. వాడు పరమాత్మ!

నీ బుద్ధిని సమానంగా చేసుకొని పని చెయ్యి. యోగంలో ఉండి కర్మ చెయ్యి, అంటే కర్మని యోగంగా చెయ్యి. ఇప్పుడు మనం స్వార్థంతో పని చేస్తున్నాము. అందుకే మనకి జ్ఞానం కలగటం లేదు. నువ్వు పనిలో సక్సెస్ అవ్వవచ్చు, ఫెయిల్ అవ్వవచ్చు. సక్సెస్ అయితే సంతోషపడిపోయి గర్వం తెచ్చుకోవటం, ఫెయిల్ అయితే దుఃఖపడిపోయి క్రుంగిపోవటం బెంగ పెట్టుకోవటం, అలా ఉండకూడదు. బెంగ పెట్టుకోవటం కూడా మంచిది కాదు. మీరెవరూ ఏ విషయం గురించీ బెంగ పెట్టుకోకూడదు. బెంగ వల్ల మనస్సుకి జబ్బు వస్తుంది. నువ్వు సమానబుద్ధిని కలిగి ఉండు. ఏదో ఒకటి ఆశించి పని చేసేవాళ్ళు, ఎదుటివాళ్లతో మాట్లాడితే మనకి ఏమి కలిసివస్తుంది అని లెక్కలు వేసుకునే వాళ్లందరూ కూలివాళ్ళు అన్నారు. కర్మఫలాన్ని ఆశిస్తూ మనము యోగులం అని అనుకొంటున్నాము, కాని ఆయన మనల్ని కూలివాళ్ళు అంటున్నాడు. అందుచేత మీ పుణ్యపాపాలు ఇక్కడే ఈ భూమి మీదే వదిలేయండి. మీరు ఒకవేళ మంచి కర్మ చేసినా దానిని జ్ఞాపకం పెట్టుకోవద్దు. నామస్మరణ చేసుకోండి, మీ ఇష్టదైవాన్ని స్మరించుకోండి.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
INDIAN BANK, VEDANGIPALEM BRANCH
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

అర్హత

వ్యవహారికంగా మనము దేనిని సాధించాలన్నా తగిన ప్రయత్నం చేయాలి. వ్యవసాయం చేయాలంటే దానికి సంబంధించిన కృషి చేయాలి. ఉద్యోగం చేయాలంటే తగిన చదువు చదివి, అర్హత సంపాదించాలి. వ్యాపారం చేయాలంటే తగిన పెట్టుబడి కావాలి. ఇలా ఏది చేయాలన్నా అందుకు తగిన అర్హత కలిగియుండాలి. సమాజంలో మనలో కొంతమంది ఆధ్యాత్మికంగా ఏదో సాధించాలని, దైవాన్ని చూడాలని, మోక్షాన్ని పొందాలని, కోరుకుంటూ తగిన ప్రయత్నం చేస్తుంటాము. కాని ఏదో తెలియని వెలితి, దుఃఖము, అశాంతి వెంటాడుతూనే ఉంటుంది. మానవాళి అందరి ప్రధాన సమస్య దుఃఖం. మరి దుఃఖానికి కారణం ఏమిటి అని విచారణ చేస్తే అజ్ఞానం అనగా దేహాత్మబుద్ధి అని తెలుస్తుంది. అజ్ఞానం నిజంగా లేదు, దేహాత్మబుద్ధే అజ్ఞానం. అందువల్లే దుఃఖ కారణమైన అజ్ఞానం నశించాలంటే వాస్తవంగా తాను ఎవరో తెలుసుకోమన్నారు భగవాన్ రమణమహర్షి. దుఃఖ కారణమైన అజ్ఞానాన్ని దూరం చేసుకోవాలంటే దానికి విరుగుడు అయిన 'ఆత్మ జ్ఞానాన్ని' సంపాదించాలి. జ్ఞానానికి మరో పేరే పరమశాంతి, అదే సర్వుల స్వరూపం. అహంకారం నశించిన స్థితికి మరో పేరే శాంతి. గడ్డి వాములో పడ్డ నిప్పురవ్వ ఎంత చిన్నదైనా మొత్తాన్ని దగ్ధం చేస్తుంది. పాలలో వేసిన చిన్న మజ్జిగ చుక్క మొత్తం పాలను పెరుగుగా మార్చేస్తుంది. అదేవిధముగా నేనెవరు అన్న విచారణ ద్వారా మనస్సును దాని మూలములోనికి అంతర్ముఖము చేస్తే, మనసులో అప్పటి వరకు గూడుకట్టుకున్న దుఃఖరాశి దగ్ధం కావడం మొదలవుతుంది. శాంతి (లేదా) ఆనందం అంటే కష్టాలు, దుఃఖము లేని స్థితి కాదు. సుఖ, దుఃఖాలను అనగా ద్వంద్వాలను సమానముగా స్వీకరించే స్థితి. కాబట్టి సమస్త సాధనల లక్ష్యం స్వరూప సచ్చిదానంద స్థితిని తానుగా, నేనుగా అనుభవైకవేద్యం చేసుకొనుటయే. దైవం మన మొట్టమొదటి ప్రాధాన్యత కాకపోతే దైవాన్ని తెలుసుకోలేం. మనిషి తన సహజత్వాన్ని మరచి ఏదో అవ్వాలి అనెడి కోరికయే బంధ, మోక్షాలకు కారణం. నేను అనెడి వ్యక్తిభావన ఉంటే దేవుడు ఉండడు, నేను అనెడి వ్యక్తిభావన లేకపోతే ఉన్నదే దేవుడు. ముక్తిని సాధించడానికి 'అర్హత' భ్రాంతిని విడిచి పెట్టడమే.

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

సత్యానుభవం పొందినవాడే సద్గురువు - ఆయనే శిష్యులకు కల్పవృక్షం

సత్కార్యాలవల్ల ఉత్తమ జన్మలభిస్తుంది. కాని ముక్తి సద్గురువు అనుగ్రహంవల్ల మాత్రమే లభిస్తుంది. సత్కర్మవల్ల చిత్తశుద్ధి లభిస్తుంది. అది సత్యానుభవానికి సహకరిస్తుంది. జ్ఞానానికి మించిన సంపద లేనేలేదు. విజ్ఞుడు అయినవాడు ముందుగా బుద్ధికి అతీతమైన సచ్చిదానందమయమైన సద్గురువును స్మరించుకొని ఆయన చెప్పిన మార్గంలో సాధనలో మునిగిపోవాలి. మనం ఎక్కడ ఉన్నా ఆ సచ్చిదానంద పరబ్రహ్మాను నిరంతరం ధ్యానిస్తూ ఉంటే పురుగు తుమ్మెద అయినట్లు అనగా భ్రమరకీటక న్యాయంలా సాధకుడు తానే సచ్చిదానంద బ్రహ్మమౌతాడు. గురువును భావనచెయ్యగా చెయ్యగా మనలో ఏభావన లేని స్థితికి వస్తాము అంతదాకా భావన చెయ్యాలి. అది భావనకు పరమావధి ఆ స్థితిలో భావించటానికి ఏమీ ఉండదు. అంటే ఒకటైనది అన్నమాట. మనస్సు ఆ భావములోనే భాగ్యం పొందుతుంది. అది నోటితో చేసే ఉపదేశంకాదు అనుభవానికి చెందినస్థితి అంటారు అనుభవజ్ఞులు. పవిత్రమైన సదాచారంతో నీతినియమాలతోజీవితాన్ని గడుపుతూ ఉండటం పరమాత్మ ప్రాప్తికి అవసరమే. అందమైన నగిషీలతో గాజుపాత్రలు అన్ని శుభ్రం చేసి మేజా బల్లపై అందంగా తీర్చిదిద్దితే ఆకలి ఎలా చల్లారుతుంది. మనకు సద్గురువు మార్గదర్శకత్వం లేకపోతే ఆ తీర్చిదిద్దిన గాజుపాత్రలో అమృతంలేని ఖాళీ పాత్రే అవుతుంది. నియమాలే జీవితలక్ష్యం కాదు. మరణసమయంలో రోగాలతో సతమతమౌతున్నప్పడు కలిగే బాధవర్ణనాతీతం కాని ఒక సద్గురు పర్యవేక్షణలో ఉన్నప్పడు ఆనందపరవశుడై తన పెళ్ళిరోజున కలిగే సంతోషం కన్న అమితసుఖాన్ని పొందుతాడు. ఆ సమయంలో గురువుమోహాన్ని తప్పించి మనోమాలిన్యాన్ని తొలగించి అన్ని వైపులనుంచి అంతర్ముఖం చేస్తాడు. మనం కొండకోనల్లో ఉన్నా కంటికి రెప్పలా కాపాడుతాడు. అది పరమభక్తుల జీవనశైలి అని నిజభక్తులు తేలికగా గ్రహిస్తారు. ఇది సత్యం-సత్యం-సత్యం. కాని ఎంత నీచమైనది ఈ మనస్సు ఎంత దుర్బుద్ధిగలది. గురువే ఆప్తమిత్రుడని ఎరుగనియ్యదు కదా! సద్గురువు కురిపించే దయను ఆసరాగా తీసుకొని అంతరంగంలోకి వెళ్ళాలి. శ్రీనాన్నగారు “మూడునెలల పసిపాపను తల్లి ఎలా చూచుకొంటుందో గురుప్రేమ అలా ఉంటుంది” అన్నారు. అంటే బిడ్డకు ఎప్పడు పాలు ఇయ్యాలి, ఎప్పడు స్నానం చేయించాలి ఎప్పడు నిద్రపుచ్చాలి అని ప్రేమతో విశ్వమనస్సుతో మనలను నిరంతరం పరివేక్షిస్తూ, పోషిస్తూ ఉంటారు. వాసనలు పోవటనికి శిక్షించే తండ్రిలాగా తిరిగి లాలించే తల్లిలా ఆయన ఒడిలో సుఖంగా జీవిస్తాడు. నిజభక్తులు మాత్రమే ఈ సూక్ష్మవిషయాన్ని నరనరాల్లో జీర్ణించుకొంటారు. గురుస్మరణపై ఎక్కువ శ్రద్ధవహిస్తే ఏకాగ్రత ఎంతవరకూ ఉన్నది తెలుస్తుంది. పరంధామం నుంచి ఆజ్ఞతో పిలుపు వచ్చివారి ధ్యాసే అంతరంగంలోకి వెళుతుంది. వారికే సత్యం ప్రాప్తమౌతుంది. ఇది అంతా మన చేతుల్లో లేదు. పరమాత్మ ఆజ్ఞ అయినప్పడే సద్గురువుతో సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. అప్పడు మన సాధనామార్గం మరుమల్లెబాటయై గమ్యాన్ని చేరుతాము గురురుణం ఎన్నటికీ తీరదు. **- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**